



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 6, పేజీలు - 08

గురువారం, జూన్ 5, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati





# ఆరోపణల సుడిగుండంలో కాళేశ్వరం ప్రాజెక్టు

## - కేసీఆర్, హరీశ్, ఈటల పాత్రపై విచారణ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఒక అద్భుతమైన ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనమని చాలామంది భావిస్తారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అవినీతి, నాణ్యతా లోపాలకు నిలయంగా ఆరోపిస్తోంది. ఈ ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడి అని గులాబీ నేతలు అంటుంటే, ఇది మొత్తం అవినీతిమయం అని హస్తం నేతలు విమర్శిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడంతో, ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలున్నాయని, డిజైన్‌లో తప్పులున్నాయని, అంచనాలు పెంచేశారని, భారీగా అవినీతి జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం మార్చి 2024లో ఒక జుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఏకసభ్య కమిషన్‌గా ఏర్పాటు చేయబడిన దీనికి మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ అధిపతిగా వ్యవహరిస్తున్నారు.

### కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రధాన ఆరోపణలు

మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం, పంపుహౌస్‌లు మునిగిపోవడం వంటి సంఘటనలు ప్రాజెక్టు డిజైన్‌లో, నిర్మాణంలో తీవ్రమైన లోపాలను ఎత్తిచూపుతున్నాయి. ? ప్రాజెక్టు అంచనా వ్యయం ప్రారంభంలో వేల కోట్ల రూపాయలు ఉండగా, అది లక్ష కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. ఇందులో అవినీతి జరిగిందన్న ఆరోపణలున్నాయి. ? నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని, తక్కువ నాణ్యత కలిగిన సామగ్రిని ఉపయోగించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ? ప్రాజెక్టు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, ఇందులో ముఖ్య నేతలకు లబ్ధి చేకూరిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ పాత్రపై విచారణ

తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలోనే ఈ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. ఆయనే స్వయంగా ఈ ప్రాజెక్టును ఒక ఇంజినీర్‌గా

2లో..

# కులగణనపై కేంద్రం కీలక నిర్ణయం

## - వచ్చే ఏడాది నుంచి ప్రక్రియ ప్రారంభం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రతీ 10 ఏళ్లకోసారి జరిగే జనగణన 2021 నుంచి వివిధ కారణాల వల్ల వాయిదా పడుతూనే వస్తోంది. ఇప్పుడు అప్పుడు అంటూ కేంద్ర ప్రభుత్వం వాయిదా వేస్తోంది. తాజా కేంద్ర కేబినెట్ భేటీలో జనగణనకు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా కులగణనను రెండు దశల్లో చేపట్టాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా తొలి దశ కులగణన చేపట్టడానికి ప్లాన్ చేస్తుండగా 2027 మార్చి 1వ తేదీ నుంచి రెండో దశ కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వ వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. అయితే వాస్తవానికి 2020 ఏప్రిల్లో జాతీయ జనాభా గణన ప్రారంభం కావాల్సి ఉండగా అప్పుడే దేశంలో కరోనా మహమ్మారి వెలుగు చూడటంతో వాయిదా పడింది. ఒకవేళ కొవిడ్ వైరస్ వ్యాప్తి లేక అప్పుడే ఈ జనగణన చేసి ఉంటే తుది నివేదిక 2021 నాటికి వెలువడేది. ఇక తొలి దశలో భాగంగా 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కులగణన, జనగణన చేయనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.
రెండో దశ 2027 మార్చి 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా మిగిలిన ప్రాంతాల్లో కులగణనతో పాటు జనగణనను నిర్వహించనున్నారు. ఈ కులగణన, జనగణన ప్రక్రియకు సంబంధించిన అధికారిక గెజిట్‌ను జూన్ 16వ తేదీన కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ విడుదల చేసే

2లో..

# జగన్ నేరాలకు సాక్ష్యాలు ఉంటే చర్యలు

## - ఏపీ కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన ఏపీ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలపై సీఎం చంద్రబాబు, మంత్రివర్గం చర్చించి ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి సంబంధించి సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే శ్రీకాకుళంలో రక్షిత మంచినీటి సరఫరాపైనా కీలక నిర్ణయం తీసుకున్నారు. శ్రీకాకుళం రక్షిత నీటి సరఫరాకు రూ. 5.75 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండ్‌కు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం నియోజకవర్గానికి రూ. 8.22 కోట్లు వయబిలిటి గ్యాప్ ఫండ్ విడుదలకు ఆమోదం లభించింది.అలాగే రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ కోసం

2లో..

## అధికారంలోకి వచ్చి ఏడాదైనా

# ఒక్క హామీ నెరవేర్చలేదు



- ప్రజలను నమ్మించి మోసం చేశారని జగన్ ఆరోపణ
- రాష్ట్రవ్యాప్తంగా 'వెన్నుపోటు దినం'కు భారీ స్పందన వచ్చిందని వెల్లడి
- ప్రజల ఆవేదన, ఆగ్రహం వెల్లువెత్తిందన్న వైసీపీ అధినేత
- న్యాయం, ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టీకరణ

అమరావతి (ప్రశ్న న్యూస్) చంద్రబాబు అధికారంలోకి వచ్చి సరిగ్గా ఏడాది పూర్తయిందని, ఈ సంవత్సర కాలంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా దారుణంగా మోసం చేశారని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిందని, అందుకే జూన్ 4వ తేదీని 'వెన్నుపోటు దినం'గా పాటిస్తున్నామని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తమ ఆవేదనను, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని జగన్ పేర్కొన్నారు. జగన్ ఈ మేరకు నేడు సోషల్ మీడియాలో స్పందించారు. చంద్రబాబు ఏడాది పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "సరిగ్గా ఏడాది క్రితం, జూన్ 4న, చంద్రబాబు ఎన్నో గొప్ప వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారు, కానీ ఒక్కటి కూడా నెరవేర్చలేదు. బదులుగా, ఆయనను నమ్మిన ప్రజలనే దగా చేశారు. ఆయన అసత్య ప్రకటనలు, విఫలమైన హామీలు, మరియు దారుణమైన వెన్నుపోటు రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశలోకి నెట్టాయి" అని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే తాము 'వెన్నుపోటు దినం'కు పిలుపునిచ్చామని, దీనికి అన్ని వర్గాల ప్రజల నుంచి భారీ స్పందన లభించిందని ఆయన తెలిపారు. "ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి, తమ తీవ్ర ఆవేదనను, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇది కేవలం నిరసన మాత్రమే కాదు అబద్ధాలు, మోసాలను చూస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు మౌనంగా

2లో..

## పార్లమెంట్ వర్షాకాల

# సమావేశాలు

## - తేదీలు ఖరారు చేసిన కేంద్రం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 21 న ప్రారంభం కానున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. ఆగస్టు 12 వరకు పార్లమెంట్

2లో..

# పాడి రైతులకు కాంగ్రెస్ సర్కార్ శుభవార్త

## - ఇందిరా డెయిరీ పథకం అమలు

## - కీలక ప్రకటన చేసిన డిప్యూటీ సీఎం భట్టి




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుంది. వారి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నాలకు 500 రూపాయల బోనస్, పంటలకు మద్దతు ధర వంటి పథకాలను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా తెలంగాణ సర్కార్ మరో కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా పాడి రైతులకు చాలా మేలు జరుగుతుంది అంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పాడి రైతులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుభవార్త చెప్పారు. ఇందిరా డెయిరీ పథకం కింద ప్రతి లబ్ధిదారుడికి రెండు గేదెలు ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈక్రమంలో మంగళవారం మధిర క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఈ పథకం అమలు తీరుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి కీలక ప్రకటన చేశారు. ఇందిరా డెయిరీ పథకంలో భాగంగా

2లో..

## ఆగస్ట్ 15 కల్లా 15 లక్షల కుటుంబాలను

# దత్తతు తీసుకోవాలి

## - అధికారులకు కొత్త టార్గెట్ నిర్దేశించిన సీఎం చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన పీ4 (ప్రజలు-ప్రభుత్వం-ప్రైవేటు-పంచాయతీ) కార్యక్రమంలో భాగంగా, ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి 15 లక్షల 'బంగారు కుటుంబాలను' మార్గదర్శులు దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందుకు అనుగుణంగా 'మార్గదర్శి' నమోదు ప్రక్రియను, దత్తత కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంస్కరణల అనంతరం వచ్చిన పీపీపీ (ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం) తరహాలోనే ఇప్పుడు పీ4 విధానాన్ని అమలు చేస్తున్నామని

2లో..

# ఆర్సీబీ విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట

## - 11 మంది మృతి, 33 మందికి తీవ్ర గాయాలు

2లో..



## రాజకీయ దురుద్దేశంతోనే

# కేసీఆర్‌కు నోటీసులు

## - కాళేశ్వరం విచారణపై ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం

- కాళేశ్వరం విచారణ కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపేనని కవిత ఆరోపణ
- కేసీఆర్‌కు నోటీసులివ్వడంపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర ఆగ్రహం
- ధర్నా చౌక్‌లో నిరసన చేపట్టిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు
- ఇది కాళేశ్వరం కమిషన్ కాదని, కాంగ్రెస్ కమిషన్ అని విమర్శ
- రైతుల సంక్షేమం కోసమే కాళేశ్వరం కట్టామని వెల్లడి

2లో..



## ఇంతమంది వస్తారని

# ఊహించలేదు

- తొక్కిసలాట ఘటనపై సీఎం సిద్ధరామయ్య - ఘటనలో 11 మంది మృతి, పలువురికి గాయాలు
- ఊహించనంత జనం వచ్చారన్న సీఎం సిద్ధరామయ్య
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటన

2లో..



## ఆరోపణల సుడిగుండంలో కాళేశ్వరం ప్రాజెక్టు

రూపొందించారన్న ప్రచారం విస్తృతంగా సాగింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం సహా అన్ని విషయాల్లో కేసీఆర్ కీలకపాత్ర పోషించారన్నది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భావన. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం, అంచనాల పెంపు, నిధుల్లో అవినీతి వంటి వాటిపై విచారణ జరిపేందుకు కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. నేడు విచారణకు హాజరు కావాలని మొదట నోటీసుల్లో పేర్కొంది. అయితే, కేసీఆర్ విజ్ఞప్తి మేరకు కమిషన్ విచారణ తేదీని జూన్ 11కు మార్చింది. ప్రాజెక్టు రూపకల్పన దశ నుండి ప్రాజెక్టు ప్రారంభం వరకు జరిగిన అన్ని అంశాలపై కేసీఆర్‌ను కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్ణయాలు, పర్యవేక్షణ వంటి అంశాల్లో ఆయన పాత్రపై ఆరా తీయనుంది.

### మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు

తెలంగాణ ఏర్పడిన తొలి ప్రభుత్వంలో హరీశ్ రావు నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణ పనుల పర్యవేక్షణ, అంచనాల పెంపు, పర్యవేక్షణ లోపాలు, మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం వెనుక గల కారణాలు, నిధుల్లో అవకతవకల ఆరోపణలు వంటి అంశాలపై కాళేశ్వరం కమిషన్ విచారణ జరపనుంది. జూన్ 9వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు జారీ చేసింది. ప్రాజెక్టు అమలులో మాజీ మంత్రి హరీశ్ రావు పాత్ర, ఆయన నిర్ణయాలు, బాధ్యతలపై కమిషన్ దృష్టి సారించనుంది.

### నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పాత్రపై విచారణ

కేసీఆర్ తొలి కేబినెట్‌లో ప్రస్తుత బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, వ్యయ అంచనాలు, ఆర్థిక శాఖ అనుమతుల జారీ, నిధుల పంపిణీ, బడ్జెట్ కేటాయింపులు, ఆర్థిక అవకతవకలపై ఆరోపణలు వంటి అంశాలపై విచారణకు ఈటల రాజేందర్‌ను కమిషన్ ప్రశ్నించనుంది. జూన్ 6వ తేదీన విచారణకు హాజరు కావాలని కాళేశ్వరం కమిషన్ నోటీసుల్లో పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈ విచారణ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మాజీ సీఎం కేసీఆర్ కమిషన్ ఎదుట హాజరు కావాలని నిర్ణయించుకోవడం ఇప్పుడు మరింత చర్చకు దారితీసింది.

# కులగణనపై కేంద్రం కీలక నిర్ణయం

అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ జనగణన, కులగణనలో పురుషులు, మహిళలను లెక్కించనున్నారు. ఇందులో భాగంగానే కులం, ఉపకులాలను లెక్కించి జాబితాను తయారు చేయనున్నారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో ఈ జనాభా లెక్కలను నిర్వహించనున్నారు. ఈ జనగణన, కుల గణనను పారదర్శక పద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. అయితే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పార్టీలతో పాటు పలు ప్రాంతీయ పార్టీలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. దేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలు కులగణన సర్వేను నిర్వహించాయి.

## జగన్ నేరాలకు సాక్ష్యాలు ఉంటే చర్యలు

వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులు, అలాగే ఆయా కంపెనీలు ప్రభుత్వం అందించే రాయితీల కల్పనకు ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక అన్నింటికంటే ముఖ్యంగా ఖైదీల క్షమాభిక్షపై ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను జైళ్ల నుంచి విడుదల చేసేందుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. అందులో భాగంగా 2025 ఫిబ్రవరి 1 నాటికి అర్హులైన 17 మంది యావజ్జీవ శిక్ష పడిన ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది. వీటితో పాటుగా 248 మంది కానిస్టేబుళ్ల ప్రమోషన్‌పై గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 248 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పించేందుకు ఆమోదం తెలిపింది. అలాగే పోలీస్ అకాడమీ కోసం అదనంగా 94.45 ఎకరాలు ఇవ్వాలని నిర్ణయించింది.అలాగే రాష్ట్రంలోని మహిళలు రాత్రిపూట కూడా పనిచేసేలా చట్ట సవరణకు ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అలాగే రాత్రి వేళ పనిచేసే మహిళలకు భద్రత, రవాణా సౌకర్యం కల్పించాలని కంపెనీలకు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు వైఎస్సార్ జిల్లా పేరును ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లాగా మార్చిన సంగతి తెలిసిందే. ఆ మేరకు ఇటీవల ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో వైఎస్సార్ జిల్లా పేరు మార్పుపై విడుదల చేసిన జీవోను కేబినెట్ ఆమోదించింది.

## అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క హామీ నెరవేర్చలేదు

ఉండరనే బలమైన సందేశం ఇది" అని జగన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనడం, మోసపోయిన ప్రజల బాధ, నిరాశ, ప్రతిఘటనలకు అద్దం పడుతోందని జగన్ పేర్కొన్నారు. "ఈరోజు అణగారిన ప్రజలతో పాటు నిలబడి, ఈ నిజాన్ని వినిపించడానికి భుజం భుజం కలిపి నిలబడిన ప్రతి వైసీపీ నాయకుడికి, కార్యకర్తకు, పౌరుడికి నేను హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని జగన్ పేర్కొన్నారు. న్యాయం, ఆత్మగౌరవం, ప్రజల హక్కులు, వారి ప్రయోజనాల కోసం తమ పోరాటం మరింత బలపడుతుందని స్పష్టం చేశారు. తమ పోరాటం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా మరింత ఉద్ధృతంగా కొనసాగుతుందని జగన్ తెలిపారు.

## ఆగస్ట్ 15 కల్లా 15 లక్షల కుటుంబాలను

# దత్తతు తీసుకోవాలి

ముఖ్యమంత్రి తెలిపారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో జీరో పావర్టీ పీ4 కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్మార్ట్ ఏపీ ఫౌండేషన్ పేరును 'స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్'గా మార్చాలని సూచించారు. అమరావతి రాజధాని నిర్మాణంలో భూసేకరణ ప్రక్రియ పీ4 విధానానికి ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. రాజధాని కోసం భూములిచ్చిన 29 వేల మంది రైతులను భాగస్వాములను చేసి, వారికి సంపద సృష్టించామని గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో ప్రతి బంగారు కుటుంబాన్ని ఒక మార్గదర్శి దత్తత తీసుకుని, వారి అభివృద్ధికి పాటుపడేలా చూడాలని అన్నారు. పీ4 కార్యక్రమ పురోగతిని ప్రతి 10 రోజులకు ఒకసారి స్వయంగా సమీక్షిస్తానని చంద్రబాబు వెల్లడించారు. అనంతరం అధికారులు రూపొందించిన పీ4 లోగో నమూనాలను ఆయన పరిశీలించారు.

### పీ4 కార్యక్రమానికి భాగస్వామ్య సంస్థల చేయూత

పీ4 కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు మిలాప్, ప్రాజెక్ట్ డీప్, రంగ్ దే, భార్గో వంటి పలు సంస్థలు భాగస్వాములుగా సహకారం అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయని అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 19,15,771 కుటుంబాలను 'బంగారు కుటుంబాలు'గా గుర్తించగా, వీరిలో 70,272 కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని తెలిపారు. దత్తత తీసుకున్న కుటుంబాలలో అత్యధికంగా 26,340 బీసీ కుటుంబాలు, 14,024 ఎస్సీ కుటుంబాలు, 13,115 ఎస్టీ కుటుంబాలు ఉన్నాయని అధికారులు సమావేశంలో పేర్కొన్నారు.

## పాడి రైతులకు కాంగ్రెస్ సర్కార్ శుభవార్త

లబ్ధిదారుడైన ప్రతి పాడి రైతుకు రెండు గేదెలు అందజేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం లబ్ధిదారులు ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అలానే ఇందిరా డెయిరీ పథకం వర్తించాలంటే భూమి ఉండాలన్న నిబంధన ఏదీ లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

అంతేకాక, గేదెలు లేని వారికి ఇందిరా డెయిరీ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశం పాడి రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే కాక వారి జీవనోపాధిని మెరుగుపరచడం అన్నారు. ఇందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అని భట్టి తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో భాగంగా భట్టి విక్రమార్క అధికారులతో పథకం అమలు, లబ్ధిదారుల ఎంపికకు పాటించాల్సిన నియమాలు అలానే వారికి పంపిణీ చేసే గేదెలు వంటి అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. మరో ఐదు నెలల లోపు నియోజకవర్గం మొత్తం ఇందిరా డెయిరీ పథకం అమలు కావాలని భట్టి సూచించారు. ఇందుకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

దీనిలో భాగంగా లబ్ధిదారులకు పంపిణీ చేసే గేదెల కొనుగోలు కోసం అధిక సంఖ్యలో అధికారుల బృందాలు ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క కలెక్టర్‌ను ఆదేశించారు. అలానే లబ్ధిదారులకు పంపిణీ చేసే గేదెలకు అవసరమైన పచ్చి గడ్డి, ఎండు గడ్డి వివరాలపై కూడా ఆయన ఆరా తీశారు. ఈ పథకాన్ని పారదర్శకంగా సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా డెయిరీ పథకం పాడి రైతులకు ఆదాయ కల్పనతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉపయోగపడుతుందని భట్టి చెప్పుకొచ్చారు.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

సమావేశాలు కొనసాగుతాయని తెలిపారు. మూడు నెలలకు పైగా విరామం తర్వాత జూలై 21న ఉదయం 11 గంటలకు పార్లమెంటు ఉభయ సభలు సమావేశం కానున్నాయి. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ప్రతిపక్షాలు గత కొన్ని రోజుల నుంచి డిమాండ్ చేస్తున్న సమయంలో కేంద్రం పార్లమెంటు వర్షాకాల సమావేశాల తేదీని ప్రకటించడం గమనార్హం. ఆపరేషన్ సిందూర్ పై పార్లమెంట్ సంయుక్త సమావేశం నిర్వహించని కారణంగా.. కాంగ్రెస్ నేతలు మల్లిఖార్జున ఖర్గేతో పాటు రాహుల్ గాంధీ కేంద్రం తీరును తప్పుపట్టారు. ఆపరేషన్ సిందూర్ లో కూలిన ఫైటర్ జెట్లు, రాఫెల్ విమానాలు ఎన్నో ప్రజలకు లెక్క చెప్పాలంటూ సైతం విపక్షాలు తీవ్ర వ్యాఖ్యలు చేసినా కేంద్రం వాటిని పట్టించుకోలేదు.పహల్గాం ఉగ్రదాడి తరువాత అఖిలపక్ష సమావేశం నిర్వహించగా ప్రధాని మోదీ హాజరుకాలేదు. దాంతో కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వం తీరును తప్పుపట్టారు. ఇలాంటి సమయంలో దేశం మొత్తం ప్రభుత్వానికి మద్దతు తెలుపుతుంటే వారు మాత్రం, తమతో ఎలాంటి చర్చలు జరపలేదని మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. తరువాత ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్, పీఓకేలోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత బలగాలు విరుచుకుపడి ధ్వంసం చేశాయి. అనంతరం సెంట్రల్ కేబినెట్ కమిటీ భేటీ అయింది. తరువాత విపక్షాలతో కేంద్ర మంత్రులు, ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా సమావేమై ఆపరేషన్ సిందూర్ గురించి వారికి వివరించారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, ఉగ్రవాదులను ఏరివేయడమై తమ లక్ష్యం అని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

## ఆర్సీబి విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట

**బెంగుళూరు** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు ఐపీఎల్ 2025 విజేతగా నిలిచిన వేళ, బెంగళూరు నగరంలో సంబరాలు అంబరాన్నంటాయి. అయితే, ఈ ఆనందోత్సాహాల నడుమ తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బుధవారం జరిగిన విజయోత్సవ వేడుకల్లో భాగంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటలో పలువురు అభిమానులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర కలకలం రేపింది.

### విధానసౌధలో ఘన సన్మానం

మంగళవారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్‌పై గెలిచి తొలిసారిగా ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన ఆర్సీబీ జట్టుకు కర్ణాటక ప్రభుత్వం బుధవారం పౌర సన్మానం ఏర్పాటు చేసింది. విధానసౌధలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, జట్టు సభ్యులను ఘనంగా సత్కరించారు. స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీతో సహా జట్టు సభ్యులందరికీ సంప్రదాయ మైసూరు పేటాలు చుట్టిన దండలతో సన్మానం చేశారు.

### స్టేడియంలో కోహ్లీ ఉద్వేగం

చిన్నస్వామి స్టేడియంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో కూడా ఆటగాళ్లను మైసూరు పేటాలు, దండలతో సన్మానించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, భారీ సంఖ్యలో అభిమానులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం జట్టు బస్సు స్టేడియంలోకి ప్రవేశించినప్పుడు అభిమానుల చప్పట్లు, సెల్‌ఫోన్ లైట్ల వెలుగులతో వాతావరణం దద్దరిల్లింది. స్టేడియం బాల్కనీ నుంచి రజత్ పాటిదార్ మరోసారి ట్రోఫీని పైకెత్తి చూపించగా సహచర ఆటగాళ్లు ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఈ సీజన్ లో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన మెంటార్ దినేశ్ కార్తీక్ చిరునవ్వుతో కనిపించాడు.అభిమానులను ఉద్దేశించి మాట్లాడేందుకు విరాట్ కోహ్లీ మైక్ అందుకున్నప్పుడు, అభిమానుల కేరింతలతో ఆయన మాటలు పలుమార్లు వినిపించలేదు. అనంతరం కోహ్లీ మాట్లాడుతూ, "మా కెప్టెన్ చెప్పినట్టే, ఇకపై ఇది 'ఈ సాలా కప్ నమ్దే' కాదు, 'ఈ సాలా కప్ నమ్దు' (ఈసారి కప్ మనది). ఈ విజయం మీ అందరిది – అభిమానులు, ఈ నగర ప్రజలు, కష్టసుఖాల్లో ఆర్సీబీకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరిది. ప్రపంచంలో మరెక్కడా ఇంతటి గొప్ప అభిమానులను నేను చూడలేదు. ఈ రోజు మన కెప్టెన్ రజత్ పాటిదార్‌కు మీ అందరి తరపున భారీగా చప్పట్లు కొట్టాలని కోరుతున్నాను" అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

### చిన్నస్వామి స్టేడియం వద్ద పెను విషాదం

విధానసౌధలో సన్మాన కార్యక్రమం ముగిసిన అనంతరం, సాయంత్రం చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్సీబీ చారిత్రక విజయాన్ని పురస్కరించుకుని భారీ వేడుకలకు ఏర్పాట్లు జరిగాయి. తమ అభిమాన జట్టును, ఆటగాళ్లను చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన అభిమానులతో స్టేడియం పరిసరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, అభిమానుల తాకిడికి తగ్గట్టుగా సరైన భద్రతా ఏర్పాట్లు, జన నియంత్రణ చర్యలు లేకపోవడంతో స్టేడియం వెలుపల తీవ్ర గందరగోళం నెలకొని తొక్కిసలాటకు దారితీసింది. ఈ దుర్ఘటనలో అభిమానులు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన జరుగుతున్నప్పటికీ, స్టేడియం లోపల ఆటగాళ్ల సన్మాన కార్యక్రమం కొనసాగింది.

## ఆర్సీబి విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట

### - 11 మంది మృతి, 33 మందికి తీవ్ర గాయాలు

బెంగుళూరు (ప్రశ్న న్యూస్) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు ఐపీఎల్ 2025 విజేతగా నిలిచిన వేళ, బెంగళూరు నగరంలో సంబరాలు అంబరాన్నంటాయి. అయితే, ఈ ఆనందోత్సాహాల నడుమ తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బుధవారం జరిగిన విజయోత్సవ వేడుకల్లో భాగంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటలో పలువురు అభిమానులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర కలకలం రేపింది.

### విధానసౌధలో ఘన సన్మానం

మంగళవారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్‌పై గెలిచి తొలిసారిగా ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన ఆర్సీబీ జట్టుకు కర్ణాటక ప్రభుత్వం బుధవారం పౌర సన్మానం ఏర్పాటు చేసింది. విధానసౌధలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, జట్టు సభ్యులను ఘనంగా సత్కరించారు. స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీతో సహా జట్టు సభ్యులందరికీ సంప్రదాయ మైసూరు పేటాలు చుట్టిన దండలతో సన్మానం చేశారు.

### స్టేడియంలో కోహ్లీ ఉద్వేగం

చిన్నస్వామి స్టేడియంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో కూడా ఆటగాళ్లను మైసూరు పేటాలు, దండలతో సన్మానించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, భారీ సంఖ్యలో అభిమానులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం జట్టు బస్సు స్టేడియంలోకి ప్రవేశించినప్పుడు అభిమానుల చప్పట్లు, సెల్‌ఫోన్ లైట్ల వెలుగులతో వాతావరణం దద్దరిల్లింది. స్టేడియం బాల్కనీ నుంచి రజత్ పాటిదార్ మరోసారి ట్రోఫీని పైకెత్తి చూపించగా సహచర ఆటగాళ్లు ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఈ సీజన్ లో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన మెంటార్ దినేశ్ కార్తీక్ చిరునవ్వుతో కనిపించాడు.అభిమానులను ఉద్దేశించి మాట్లాడేందుకు విరాట్ కోహ్లీ మైక్ అందుకున్నప్పుడు, అభిమానుల కేరింతలతో ఆయన మాటలు పలుమార్లు వినిపించలేదు. అనంతరం కోహ్లీ మాట్లాడుతూ, "మా కెప్టెన్ చెప్పినట్టే, ఇకపై ఇది 'ఈ సాలా కప్ నమ్దే' కాదు, 'ఈ సాలా కప్ నమ్దు' (ఈసారి కప్ మనది). ఈ విజయం మీ అందరిది – అభిమానులు, ఈ నగర ప్రజలు, కష్టసుఖాల్లో ఆర్సీబీకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరిది. ప్రపంచంలో మరెక్కడా ఇంతటి గొప్ప అభిమానులను నేను చూడలేదు. ఈ రోజు మన కెప్టెన్ రజత్ పాటిదార్‌కు మీ అందరి తరపున భారీగా చప్పట్లు కొట్టాలని కోరుతున్నాను" అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

### చిన్నస్వామి స్టేడియం వద్ద పెను విషాదం

విధానసౌధలో సన్మాన కార్యక్రమం ముగిసిన అనంతరం, సాయంత్రం చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్సీబీ చారిత్రక విజయాన్ని పురస్కరించుకుని భారీ వేడుకలకు ఏర్పాట్లు జరిగాయి. తమ అభిమాన జట్టును, ఆటగాళ్లను చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన అభిమానులతో స్టేడియం పరిసరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, అభిమానుల తాకిడికి తగ్గట్టుగా సరైన భద్రతా ఏర్పాట్లు, జన నియంత్రణ చర్యలు లేకపోవడంతో స్టేడియం వెలుపల తీవ్ర గందరగోళం నెలకొని తొక్కిసలాటకు దారితీసింది. ఈ దుర్ఘటనలో అభిమానులు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన జరుగుతున్నప్పటికీ, స్టేడియం లోపల ఆటగాళ్ల సన్మాన కార్యక్రమం కొనసాగింది.

## సంస్కృత విద్యాలయ

## భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

**వరంగల్ వెస్ట్ :** హనుమకొండ జిల్లా భద్రకాళి సాంగవేద ఆగమ సంస్కృత విద్యాలయ భవన నిర్మాణ పనులకు రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, దేవాదాయ శాఖ అధికారులు పలువురు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**భద్రాచలం :** ఆర్డీవో కార్యాలయంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని అన్నారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు.

## రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్‌కు నోటీసులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ఎత్తిపోతల పథకం (కేఎల్ఐపీ)పై జరుగుతున్న విచారణను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యగా మార్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాజకీయ దురుద్దేశంతోనే మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆమె విమర్శించారు. ఈ ప్రాజెక్టులో జరిగినట్లు చెబుతున్న ఆర్థిక అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కేసీఆర్‌కు ఇటీవల నోటీసులు జారీ చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అంటే మొత్తం తెలంగాణ ప్రజలకు నోటీసులు ఇచ్చినట్లే అని పేర్కొన్నారు. ఈ చర్యను నిరసిస్తూ హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో ఆమె నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ "ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది జవాబుదారీతనం కోసం కాదు. కేవలం రాజకీయంగా పరువు తీయడం కోసం. ఇది కాళేశ్వరం కమిషన్ కాదు, కాంగ్రెస్ కమిషన్. కేసీఆర్ ఏం తప్పు చేశారు? ఆయనకు నోటీసులు ఇస్తే, యావత్ తెలంగాణ ప్రజలకు నోటీసులు ఇచ్చినట్లే" అని ఆమె అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఒక పరివర్తనాత్మక కార్యక్రమంగా కాళేశ్వరం ప్రాజెక్టును కవిత పేర్కొన్నారు. 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల సొరంగాలు, 1500 కిలోమీటర్ల కాలువలతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుందని ఆమె గుర్తుచేశారు. "కాళేశ్వరాన్ని రైతుల సంక్షేమం, భవిష్యత్ తరాల కోసం నిర్మించారు కానీ, రాజకీయాల కోసం కాదు. ఈరోజు, ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ పోరాడి సాధించుకున్న ప్రగతిని నాశనం చేస్తోంది. ఎలాంటి కక్ష సాధింపు చర్యలు తీసుకున్నా, ఏ ప్రభుత్వం కూడా కేసీఆర్ వారసత్వాన్ని తగ్గించలేదు" అని కవిత పేర్కొన్నారు. నిజం కచ్చితంగా బయటకొస్తుందని, తెలంగాణ ప్రజలకు నిజంగా ఎవరు సేవ చేశారో చరిత్ర గుర్తుంచుకుంటుందని ఆమె తెలిపారు. గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడాలని డిమాండ్ చేసిన కవిత, కాంగ్రెస్, బీజేపీలు సాగునీరు, రాష్ట్ర సంక్షేమం విషయంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఇది కాంగ్రెస్ చేస్తున్న ఒక ప్రణాళికాబద్ధమైన రాజకీయ కుట్ర అని ఆమె విమర్శించారు. కాగా, కేసీఆర్‌తో పాటు మరో ఇద్దరు మాజీ మంత్రులకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

## ఇంతమంది వస్తారని ఊహించలేదు

బెంగుళూరు (ప్రశ్న న్యూస్) 18 ఏళ్ల సుదీర్ఘ ఎదురుచూపుల తర్వాత ఐపీఎల్ టైటిల్ దక్కించుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విక్టరీ పరేడ్ తీవ్ర విషాదాన్ని నింపింది. బెంగళూరులోని చోటు చేసుకుని పలువురు మృతి చెందిన సంగతి తెలిసిందే. మరికొందరు గాయపడగా వారిలో కొందరు ఐసీయూలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. తాజాగా ఈ తొక్కిసలాట ఘటనలో చికిత్స పొందుతున్న వారిని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా ఆస్పత్రులకు వెళ్లి పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించిన సీఎం సిద్ధరామయ్య జరిగిన ఘటన గురించి కీలక వివరాలు వెల్లడించారు. అంతకుముందే కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఈ ఘటనపై మీడియాకు వివరాలు తెలిపారు. ఆర్సీబీ విజయోత్సవాల వేళ ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడం తీవ్ర బాధాకరమైన విషయమని సీఎం సిద్ధరామయ్య అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్లు వెల్లడించారు.

ఆర్సీబీ విజయోత్సవాలకు ఇంత భారీ స్థాయిలో అభిమానులు తరలివస్తారని తమ ప్రభుత్వం ఊహించలేదని పేర్కొన్నారు.ఇక ఈ తొక్కిసలాట ఘటనలో 11 మంది చనిపోయినట్లు సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. మరో 33 మందికి గాయాలు అయ్యాయని వారంతా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. తొక్కిసలాట ఘటన గురించి విని తాము షాక్ అయ్యామని ఈ విషాద ఘటన విజయానందాన్ని తుడిచిపెట్టేసిందని సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నస్వామి స్టేడియంలో ప్రేక్షకుల కెపాసిటీ 35 వేలు కాగా 2 లక్షల నుంచి 3 లక్షల మంది అభిమానులు పోటెత్తినట్లు కర్ణాటక సీఎం తెలిపారు. అయితే తాము 35 వేలు లేదా అంతకంటే కొంచెం మంది ఎక్కువగా వస్తారని అంచనా వేశామని కానీ లక్షల మంది పోటెత్తుతారని అంచనా వేయలేదని వెల్లడించారు. చిన్నస్వామి స్టేడియం ఘటనలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చొప్పున కర్ణాటక సీఎం సిద్ధరామయ్య పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. చనిపోయిన వారిలో ఎక్కువ మంది యువతే ఉన్నారని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# కాపు నేతలకు గాలం

**విజయవాడ :** వంగవీటి రాధాకృష్ణ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రయత్నించిందా? ఆయనకు ఆహ్వానం పంపిందా? పార్టీలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని చెప్పిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. రెండు ప్రధాన సామాజిక వర్గాలతో పాటు వెనుకబడిన తరగతులు వారు సైతం టిడిపి కూటమికి జై కొట్టారు. ఆపై జగన్మోహన్ రెడ్డి సొంత సామాజిక వర్గం సైతం సైలెంట్ అయింది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాజయం తప్పలేదు. అయితే ఇప్పుడు సామాజిక వర్గాల లెక్కలు కట్టుకొని పార్టీని బలోపేతం చేయాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. అందులో భాగంగానే వంగవీటి రాధాకృష్ణకు ప్రత్యేకంగా ఆహ్వానం పంపినట్లు సమాచారం.2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా వంగవీటి రాధాకృష్ణకు ప్రత్యేక ఆహ్వానం వచ్చింది. అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలుగా ఉన్న కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ మధ్యవర్తిత్వం వహించారు. వంగవీటి రాధా తో ఉన్న స్నేహంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ అందుకు వంగవీటి రాధాకృష్ణ అంగీకరించలేదు. తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో వంగవీటి రాధాకృష్ణకు నామినేటెడ్ పదవి గ్యారెంటీ అని అంతా భావించారు. అయితే ఏడాది అవుతున్నా వంగవీటి రాధాకృష్ణకు పదవి లభించలేదు. దీంతో ఆయన పార్టీలో అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం జరిగింది. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి ఆయనకు టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది.2004లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు వంగవీటి రాధాకృష్ణ. 2003లో వైయస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేశారు. ఆ సమయంలో వంగవీటి మోహన్ రంగా కుమారుడు రాధాకృష్ణను చూశారు. కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. విజయవాడ సిటీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. 2004లో తొలిసారిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. అయితే 2009లో రాజశేఖర్ రెడ్డి వద్దని చెప్పినా రాధాకృష్ణ ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అక్కడ కూడా ఓటమి ఎదురైంది. 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఆశించిన టికెట్ ఇవ్వకపోవడంతో టిడిపిలో చేరారు. ఆ పార్టీ ఓడిపోయిన అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. మొన్నటి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. ఇప్పుడు నామినేటెడ్ పదవి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.మొన్నటికి మొన్న టిడిపి మహానాడుజరిగిన సంగతి తెలిసిందే. అయితే మహానాడు కార్యక్రమంలో వంగవీటి రాధాకృష్ణ కనిపించలేదు. దీంతో ఆయనకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు టచ్ లోకి వెళ్లినట్లు సమాచారం. పార్టీలోకి ఆహ్వానించగా ముఖం మీదే ఆయన నో చెప్పారట. ఇప్పటికే వంగవీటి రాధాకృష్ణకు చంద్రబాబు నుంచి భారీ ఆఫర్ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మొన్న ఆ మధ్యన రాధాకృష్ణకు అనారోగ్యం కావడంతో యువనేత లోకేష్ పరామర్శించారు కూడా. సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా పిలిపించుకొని మాట్లాడారు. ఆలస్యం అయినా వెయిట్ చేయాలని.. నీకు తగ్గ పదవి ఇస్తానంటూ చంద్రబాబు హామీ ఇచ్చినట్లు సమాచారం. అందుకే చంద్రబాబు పై ఉన్న నమ్మకంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పదేపదే ఆహ్వానిస్తున్నా అటువైపు రాధాకృష్ణ చూడడం లేదు. మొత్తానికి అయితే వంగవీటి రాధాకృష్ణ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం లేదన్నమాట

# టీటీడీ సద్గమయ..

**తిరుపతి :** విద్యార్థుల కోసం టీటీడీ వినూత్న కార్యక్రమం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. వారిలో మానవతా విలువను పెంపొందించేందుకు 'సద్గమయ' పేరుతో కొత్త కార్యక్రమం చేపట్టనుంది. ఇందుకు సంబంధించి ఓ ప్రకటన విడుదల చేసింది.విద్యార్థుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం వినూత్నమైన కార్యక్రమాన్ని తీసుకురానుంది. దేశ భవిష్యత్తుకు పునాదులైన వారిలో?. హిందూ సనాతన ధర్మం బోధించి నైతిక విలువలను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ఇందుకోసం త్వరలోనే 'సద్గమయ' అనే కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ మేరకు టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది.తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం సోమవారం అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఇందులో 'సద్గమయ' కార్యక్రమంపై చర్చించారు.

విద్యార్థులలో సహనం, సానుభూతి, నిజాయితీ, కరుణ, విశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ వంటి అంశాలను పెంపొందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించాలని సూచించారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉండే అంశాలను శిక్షణ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన ఆదేశించారుముందుగా హెచ్ డి పీపీ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ కార్యక్రమం ప్రధాన అంశాలను వివరించారు. విద్యార్థులలో నైతికత, వ్యక్తిత్వ వికాసం, సామాజిక సేవ, నైపుణ్యాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల ప్రేమ– ఆప్యాయత– కృతజ్ఞత, కరుణ, సమగ్రతలను పెంపొందించడం వంటి అంశాలను ప్రస్తావించారు. విద్యార్థులను దేశానికి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని వివరించారు. ఈ కార్యక్రమం మొదటగా టీటీడీ పాఠశాలల విద్యార్థులతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

# సంపాదకీయం

## పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

1972 లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఏర్పాటు చేయబడింది. 1972 జూన్ 5 వ తేది నుంచి 16 వ తేది వరకు మానవ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి సమావేశం అయింది. పర్యావరణ పరిరక్షణ సదస్సు లో వాతావరణ మార్పులను గమనిస్తూ తగు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని గుర్తించారు. 1973 లో మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రపంచ పర్యావరణ దినోత్సవమును జూన్ 5 తేదిన వేర్వేరు నగరాలలో విభిన్న రీతులలో అంతర్జాతీయ వైభవంగా జరుపుకుంటున్నారు. పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాలను తగ్గించటానికి పర్యావరణ పరిరక్షణకు వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలుష్య నివారణ చర్యలకై పలు చట్టాలను రూపొందించి అమలు జరుపుతున్నది. అనాలోచిత మానవ చర్యల వల్ల కలుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న బృహత్తర లక్ష్యంతో పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా మనిషి చేస్తున్న పనుల వల్ల భూగోళం అ మితంగా వేడెక్కిపోతోంది. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వాడడం వల్ల వాయుకాలుష్యం పెచ్చు మీరుతోంది. పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతూ పదికాలాల పాటు పది లంగా చూసుకోవాల్సిన భూమిని నిస్సారంగా మార్చుతున్నాం. తరిగిపోయే వనరులకు బదులు, తరగని, పునర్వినియో గించుకోగల వనరుల ఆధారంగా జరిగే అభివృద్దే సుస్థిరా భివృద్ధి. ఇదే ధరిత్రికి సుస్థిర భవిష్యత్తును చేకూరుస్తుంది. సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. పంచభూతాలలో ఒకటిగా, భారతీయ సంస్కృతిలో భూమి భూదేవతగా భావించబడి, పూజింప బడడం కనిపిస్తుంది. భూమి పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోయినా, కనీసం హాని కలిగించకుండా ఉంటే చాలు. ఇందుకోసం అవగాహన అవసరం. అటు పర్యావరణం, వాతావరణంతో పాటు ఇటు జీవన శైలిలోనూ మార్పులతో భూ పరిరక్షణపై అవగాహన కోసం కూడా ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయి. జీవం కోల్పోయిన నేలలో దిగుబడులూ నాసిగానే ఉంటాయి. దీర్ఘకాలంలో దిగుబడులు మరీ తగ్గిపోయి ఆహార సంక్షోభాలకు దారితీసే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఆలివర్ డి షుట్టర్ గుర్తించారు. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాల వైపు మళ్లడం తప్ప మరో మార్గం లేదని నివేదించారు. వ్యవసాయంలో రసాయనాలు వాడే విధానాలను ప్రపంచవ్యాప్తం చేయడంలో కీలకపాత్ర వహించింది అమెరికా. ధరిత్రి దినోత్సవం పేరిట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కూడా అమెరికాలోనే ప్రారంభం కావడం విశేషం. 50 ఏళ్ల క్రితం ఏప్రిల్ 22న గేలార్డ్ నెల్సన్ నేతృత్వంలో కాలుష్యకారక విధానాలకు నిరసనగా జనం ఉవ్వెత్తున ఉద్యమించారు.భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో "వాయుకాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1986వ సంవత్సరంలో "పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది.మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజించింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపువర్గంగా వర్గీకరించింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విషవాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణంలోకి వదలాలి. ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణురియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్ళు, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది.భూమి, నీరు వంటి మౌలిక వనరులను గరిష్ట సామర్థ్యంతో వినియోగించాలి. వినియోగ అనుకూల సామర్థ్యాన్ని పెంచాలి.

దూరదృష్టితో తరగని, పునర్వినియోగించు కోగల వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా సౌరశక్తి వినియోగం అధికంగా జరగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనీస స్థాయికి తగ్గించ గలగాలి. అడువుల సంరక్షణ, పెంపకం, సుస్థిర యాజమాన్య పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ జరగాలి. తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒక వేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది.

అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఎదో చేయాలని మిన్నకుండి పోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి.

# ఉక్రెయిన్ దాడి పర్యవసానాలేమిటి?



నాటో కూటమి దేశాలు సృష్టించిన ఉక్రెయిన్ సంక్షోభం అక్షరాలా పదకొండు వందల తొంభై ఆరవ రోజులో ప్రవేశించింది. ఎప్పుడు, ఎలా ముగుస్తుందో తెలియదు. ఆదివారం నాడు రష్యా గడ్డమీద ఆపరేషన్ స్పైడర్ వెబ్ (సాలెగూడు) పేరుతో ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ల దాడిలో భారీ మొత్తంలో నష్టం చేకూర్చినట్లు జెలెన్‌స్కీ ప్రకటించాడు. దాన్ని ఉగ్రవాద చర్యగా వర్ణించిన రష్యా ప్రతిగా వెంటనే పెద్ద ఎత్తున దాడి చేసింది. ఉక్రెయిన్ చర్య మీద మంగళవారం నాడు ఇది రాసిన సమయానికి అటు డోనాల్డ్ ట్రంప్ వైపు నుంచి ఇటు వ్లదిమిర్ పుతిన్ నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు. దాడి గురించి ఉక్రెయిన్ తమకు ఎలాంటి ముందస్తు సమాచారమూ ఇవ్వలేదనే ఒక్కమాట మాత్రమే అమెరికా అధ్యక్ష భవనం నుంచి వెలువడింది. సోమవారం నాడు టర్కీ నగరమైన ఇస్తాంబుల్‌లో రెండు దేశాల మధ్య యుద్ధ ఖైదీలు, మరణించిన వారి మృతదేహాల మార్పిడికి సంబంధించిన అవగాహన కుదిరింది. మూడు రోజుల పాటు కాల్పుల విరమణ చేస్తామని రష్యా ప్రతిపాదిస్తే బేషరతుగా అంగీకరించాలని ఉక్రెయిన్ చేసిన ప్రతిపాదనను పుతిన్ దూతలు తిరస్కరించారు.పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. రెండు శిబిరాలూ తాజా పరిస్థితికి అనుగుణంగా ఎత్తుగడలను రూపొందించుకొనే కసరత్తులో ఉన్నాయని వేరే చెప్పనవసరం లేదు. బందీల విడుదల గురించి గతంలోనే ఒక అవగాహన కుదిరి అమలు చేశారు, మరోసారి మిగిలిన వారి గురించి చర్చలలో పాల్గొనటానికి ఇరువురికీ అభ్యంతరం ఉండనవసరం లేదు. దానికి ఉక్రెయిన్ జరిపినదాడికీ సంబంధం లేదు. గడచిన మూడున్నరేం డ్లుగా రెండు దేశాల మధ్య ఇలాంటి దాడులు, ప్రతిదాడులూ జరుగుతూనే ఉన్నాయి. అయితే ఆదివారం నాడు ఉక్రెయిన్ జరిపిన దాడికి ఉన్న ప్రాధాన్యతను తక్కువ అంచనా వేయనవసరం లేదు. యుద్ధమన్న తర్వాత రెండు వైపులా నష్టం ఉంటుంది. మూడున్నరేండ్ల రష్యా మిలిటరీ చర్యలో ఉక్రెయిన్ ఇప్పటి వరకు కోల్పోయిన ప్రాంతం, ఇతర వాటితో పోల్చితే ఆది వారం నాటి రష్యా నష్టం పెద్దదేమీ కాదు.ఇక ఇస్తాంబుల్ చర్చల విషయానికి వస్తే జూన్ రెండవ తేదీన ఖైదీల మార్పిడి గురించి తప్ప శాంతి ప్రతిపాదనల మీద ఎలాంటి పురోగతీ లేదు. ఉక్రెయిన్ దాడిని అవకాశంగా తీసుకొని పశ్చిమ దేశాల పండితులు రష్యన్ సామర్థ్యం గురించి కథనాలు వండి వారుస్తున్నారు, ప్రచారదాడికి పూనుకున్నారు. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న సైబీరియాతో సహా రష్యా భూభాగంలోకి ఉక్రెయిన్ డ్రోన్లను ఎలా పంపింది. ఏక కాలంలో ఐదు వైమానిక స్థావరాల మీద ఎలా దాడి చేసింది అన్నది ఇంకా బహిర్గతం కావాల్సి ఉంది. ఈ పథకాన్ని రచించేందుకు తమకు పద్దెనిమిది నెలలు పట్టిందని జెలెన్‌స్కీ చెప్పుకున్నప్పటికీ పశ్చిమ దేశాలన్నింటి ఉమ్మడి హస్తం దీనివెనుక లేకుండా ఉక్రెయిన్‌కు అంతసీన్ లేదు. అంతర్గతంగా రష్యాలో కొందరు చేతులు కలిపిన కారణంగానే డ్రోన్ల రవాణా జరిగిందన్నది ప్రాథమిక సమాచారం. రష్యా పత్రిక మాస్కో టైమ్స్ కథనం సారాంశం ఇలా ఉంది. ఉక్రెయిన్ నగరాల మీద బాంబులు వేసేందుకు ఉపయోగించే 41టియు 95, టియు 22 బాంబర్లు, ఏ 50 అనే రాడార్ విమా నాన్ని ధ్వంస చేసినట్లు ఉక్రెయిన్ చెప్పినదాన్ని నిర్ధారించుకోవాల్సి ఉంది. వీటిలో పదికంటే తక్కువే మిలిటరీ సర్వీసులో ఉన్నాయి.మరో రెండింటిని 2024లో ఉపరితలం నుంచి ప్రయోగించే క్షిపణులతో ఉక్రెయిన్ కూల్చివేసింది. మూడున్నర సంవత్సరాలలో ఇది రష్యాకు మూడవ పెద్ద దెబ్బ. ఈ రకం విమానాలను ఇప్పుడు రష్యా ఉత్పత్తి చేయటం లేదు. టియు 160 రకం బాంబర్లు గాక ఇవి ఒకే సారి 16క్షిపణులను రెండు వేల కిలోమీటర్ల దూరం మోసుకుపోగలవు. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో అనేక విమానాలకు నిప్పంటుకున్నట్లు, ఆర్పివేసినట్లు, ఎలాంటి మరణాలు లేవని, అనుమానితులను అరెస్టు చేసినట్లు రష్యన్ రక్షణ మంత్రిత్వశాఖ నిర్ధారించింది. రష్యా వ్యూహాత్మక బాంబర్లలో 34శాతాన్ని ధ్వంసం చేశామని వాటి నష్టం 7 బిలియన్ డాలర్లని ఉక్రెయిన్ భద్రతా సంస్థలు చెప్పాయి. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా విశ్లేషించిన వారు మొత్తం 13 విమానాలు నాశనం లేదా దెబ్బతినట్లు చెప్పారు. ఎనిమిదని వాషింగ్టన్ డిసికి చెందిన నిపుణుడు క్రిస్ బిగ్గర్స్ ఎక్స్‌లో పోస్టు చేశాడు.మరోచోట ఐదు అని ఉక్రెయిన్ ఓకో హౌరా గ్రూపు విశ్లేషకులు పేర్కొన్నారు. చెక్క పెట్టెల్లో117 డ్రోన్లను ఉంచి రష్యా ట్రక్కులలోనే రహస్యంగా తరలించామని, రిమోట్ కంట్రోలుతో చెక్క పెట్టెల మూతలను తొలగించి డ్రోన్లతో దాడి చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొన్నది. వైమానిక కేంద్రాల సమీపం నుంచి వాటిని ప్రయోగించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ చెప్పింది.ఒక వైమానిక కేంద్రం ఉక్రెయిన్ నుంచి సైబీరియాలో 4,300 కిలోమీటర్లు, మరొకటి 1,900కి.మీ దూరంలో ఉంది. మూడు కేంద్రాల మీద జరిగిన దాడిని తిప్పికొట్టిన్లు పేర్కొన్నది. పర్యవసానాలు, రష్యన్ మిలిటరీ సామర్థ్యాన్ని అంచనా వేయటం ఈ దశలో కష్టం. ఇదీ మాస్కో టైమ్స్ మరుసటి రోజు విశ్లేషణ. ఉక్రెయిన్ దాడి మీద రష్యా ఎలా స్పందిస్తుందోనని ప్రపంచమంతా ఎదురు చూస్తున్నది. అది అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ మీద ఆధారపడి ఉంటుందన్నది ఒక తర్కం. తాను అధికారానికి వచ్చిన 24 గంటల్లోనే పరిష్కరిస్తానని చెప్పిన సంగతి తెలిసిందే. ఫారిన్ పోలిసీ అనే పత్రిక సిఐఎలో రష్యా గురించి విశ్లేషణ చేసిన మాజీ డైరెక్టర్ జార్జి బీబీతో మాట్లాడింది. పరిస్థితిని సాధారణ స్థాయికి తీసుకురావాల్సింది డోనాల్డ్ ట్రంప్ అని బీబీ చెప్పాడు. ఉక్రెయిన్ దాడి మీడియా ప్రత్యేకించి పశ్చిమదేశాల దృష్టిని పెద్దగా ఆకర్షించవచ్చు, రష్యా మీద పెద్ద ప్రభావం చూపుతుందని అనుకోవటం లేదు, దాని సామర్ధ్యాన్ని దెబ్బతీయదని, రెండు దేశాల మధ్య పెద్ద మార్పులు తెస్తుందని అనుకోవటం లేదన్నాడు. రష్యన్ మిలిటరీ వైమానిక, పెద్దడ్రోన్ల దాడిని ఎలా ఎదుర్కోవాలా అన్నదాని మీదే భద్రత గురించి దృష్టి సారించింది తప్ప భూమి మీద నుంచి డ్రోన్లను ప్రయోగించి దెబ్బతీసే ఎత్తుగడల గురించి కేంద్రీకరించలేదన్నది ప్రాథమికంగా కనిపిస్తున్నది.తక్కువ ఎత్తులో సమీపం నుంచి దాడి చేసే చిన్న డ్రోన్ల గురించి దృష్టి సారించలేదు. ఇది ఒక్క రష్యాకే కాదు యావత్ ప్రపంచానికి ఒక మిలిటరీ గుణపాఠం. ఎలాంటి అనుమానం కలగకుండా రష్యన్ డ్రైవర్లు వాటిని ట్రక్కులలో వైమానిక స్థావరాల వద్దకు తీసుకు వెళ్ల గలిగారు. మాస్కోలోని ప్రధాన గూఢచార కార్యాలయం సమీపం నుంచే స్పైడర్‌వెబ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి రిమోట్ కంట్రోలతో పని చేయించారని చెబుతున్నారు, నిర్ధారించుకోవాల్సి ఉంది. ఈ దాడి కారణంగా రెండు దేశాల చర్చల క్రమంలో మార్పు రాదని మరుసటి రోజే జరిగిన సమావేశం వెల్లడించింది. అయితే దీనికి, ఎవరికి వారు వేసే ఎత్తుగడలకు సంబంధం ఉండదు. ఈ దాడి తర్వాత పుతిన్‌పై ట్రంప్ పట్టు పెరుగుతుందని కొందరు భావిస్తున్నారు. ఇప్పటి వరకు రష్యాకు అనుకూలంగా పరిస్థితి ఉందని వేసిన అంచనాలను సవరించుకోవాలని సూచిస్తున్నారు. అందువలన రష్యా డిమాండ్ చేస్తున్న షరతులతో ఒప్పందానికి అంగీకరించే అవకాశం ఉండదని సూత్రీకరిస్తున్నారు. ఇంతకుముందే ఆ షరతులకు ట్రంప్ అంగీకరించలేదని, ఇప్పుడు మరింతగా వైఖరి గట్టిపడుతుందని అంటున్నారు. దాడికి ముందే గత కొద్ది రోజులుగా రష్యా మీద మరింత కఠిన వైఖరి తీసుకోవాలని, ఆంక్షల తీవ్రతను పెంచాలనే వత్తిడి ట్రంప్ మీద వస్తున్నది, ఐరోపా దేశాలు బహిరంగంగానే చెప్పాయి. పుతిన్ స్వయంగా కాల్పుల విరమణకు అంగీకరించకపోతే కొత్త ఆంక్షలను అమలు జరుపుతామనే సందేశాన్ని పంపగలడని విశ్లేషకులు చెబుతున్నారు. కొద్ది వారాల క్రితం ట్రంప్ తన ఓవల్ కార్యాలయంలో జెలెన్‌స్కీతో మాట్లాడుతూ ప్రయో గించటానికి తురుపుముక్కలేవీ లేవని చెప్పిన సంగతి తెలిసిందే. నాటో ప్రధాన కార్యాలయంలో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్ ఫిబ్రవరిలో మాట్లాడుతూ 2014కు ముందు కలిగి ఉన్న ప్రాంతాలన్నీ తిరిగి వస్తాయని ఉక్రెయిన్ భావించటం వాస్తవ విరుద్దమన్నాడు. ఇప్పుడు ధ్వంసం చేశామని చెబుతున్న ఫైటర్‌లు రష్యా దగ్గర ఉన్నవాటిలో ఒక చిన్న భాగమే.

రష్యా మిలిటరీ బలగంతో పోల్చితే ఉక్రెయిన్ ఏ మాత్రం పోల్చటానికి లేదు. అయినప్పటికీ మూడున్నరేండ్లుగా అది నిలిచి ఎదిరిస్తున్నది. కొందరు చెబుతున్నదాని ప్రకారం ఉక్రెయిన్ తన సమాచారం మొత్తాన్ని మైక్రోసాఫ్ట్‌కు తరలించింది. దాని క్లౌడ్ సేవలను ఉపయోగించుకుంది. పలు పశ్చిమ దేశాలు సమన్వయం చేసుకొని రష్యా మీద సైబర్‌దాడులు జరిపాయి. ఎలన్ మస్క్ స్పేస్‌ఎక్స్ కంపెనీ స్టార్‌లింక్‌ను అందచేసింది. ఇది ఉక్రెయిన్ సమాచార వ్యవస్థలను పటిష్టం కావించింది. మైక్రోసాఫ్ట్‌తో పాటు క్లౌడ్‌ఫేర్, పాలన్‌టిర్ వంటి అనేక సంస్థలు సైబర్‌దాడుల్లో ఉక్రెయిన్‌కు తోడ్పడ్డాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అమెరికాతో సహా నాటో దేశాలన్నీ తమ సర్వశక్తులను ఉక్రెయిన్ మీద వడ్డి అనేక విధాలుగా సాయపడ్డాయి. వాటిలో ఆధునిక డ్రోన్ల ఉత్పత్తి ఒకటి.ఇది రష్యాకంటే ఆధునికమైన వాటిని ముందుగానే రూపొందించేందుకు తోడ్పడింది. గూఢచార సమాచారం, ఆధునిక ఆయుధాల అందచేత గురించి చెప్పనవసరం లేదు. ఒక చిన్న దేశం రష్యాను ఓడించిందనే ప్రచారదాడికి దాన్ని ఒక సాధనం చేసుకోవాలని చూశాయి. మరోవైపున ఆర్థికంగా ఆంక్షలతో ఎలా దెబ్బతీశాయో చెప్పనవసరం లేదు. ఇంత చేసినప్పటికీ వాటన్నింటినీ రష్యా అధిగమిస్తూ ఇప్పటి వరకు ఐదోవంతు ఉక్రెయిన్ భూభాగాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకోగలిగింది. అనేక మౌలిక వ్యవస్థలను ధ్వంసం చేయగలిగింది. నాటో దేశాలు ఉక్రెయిన్‌ను నిలిపేందుకు ఎంత చేసినా అవి సఫలం కాలేకపోతున్నాయి. ఆయుధాలిచ్చినా వాటిని వినియోగించే నైపుణ్యం ఉక్రెయిన్ మిలిటరీకి లేదని తేలింది. అంతే కాదు, అవసరమైన సంఖ్యలో సైనికుల సంఖ్య కూడా లేదు. రష్యాలో ఉన్న రక్షణ ఉత్పత్తుల మౌలిక వ్యవస్థ ఎంతో ముఖ్యమైనది, రోజురోజుకూ రష్యాకు అనుకూలంగా పరిస్థితులు మారటంలో అది కూడా ముఖ్యపాత్ర పోషిస్తున్నది. అయితే తెల్లవారేసరికి రష్యా పైచేయి సాధిస్తుందని అర్థం కాదు. పోరు దీర్ఘకాలం సాగినందున ఉక్రెయిన్‌కు లభించిన సాయాలన్నీ తాత్కాలికం తప్ప ముఖ్యంగా ఆయుధాలు శాశ్వతం కాదు. ముందే చెప్పుకున్నట్లు అనేక ప్రాంతాలు రష్యా స్వాధీనంలోకి వచ్చాయి. ఇది రష్యాకు అనుకూలతలను పెంచింది. మిలిటరీ జవాన్ల సంఖ్యలో రష్యాదే ఆధిపత్యం. అందువల్లనే దాని ఆధీనంలోకి వచ్చిన ప్రాంతాల మీద పట్టు నిలుపుకుంటోంది. ఉక్రెయిన్‌కు తగినన్ని బలగాలు లేని కారణంగా రష్యాలో ఆక్రమించుకున్న కురుస్క్ ప్రాంతాన్ని అది నిలుపుకోలేకపోయింది. అనేక అనుభవాలను చూసిన తర్వాత పుతిన్ సేనలు వ్యూహాన్ని మార్చాయి. పశ్చిమ దేశాలు ఆశించినట్లు ఆంక్షలతో రష్యా కుదేలు కాలేదు. పోరు విషయంలో తటస్థంగా ఉన్నప్పటికీ భారత్, చైనా దాని నుంచి చమురు, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేసి ఒక విధంగా ఆర్థికంగా ఎంతగానో ఆదుకున్నాయి. అవి కూడా లబ్దిపొందాయి, ఇదొక కొత్త అనుభవం.

# కిడ్నీలో రాళ్ల గురించి కొన్ని నిజాలు

- **మూత్రంలో యూరిక్ యాసిడ్ స్థాయులు పెరిగితే కిడ్నీలో రాళ్లు**
- **చిన్న రాళ్లు లక్షణాలు చూపించకపోవచ్చు, పెద్దవి తీవ్ర నొప్పి కలిగిస్తాయి**
- **నడుము నొప్పి, మూత్రంలో రక్తం, జ్వరం వంటివి ప్రధాన లక్షణాలు**
- **జన్యుపరమైన కారణాలు, గౌట్, డయాబెటిస్ వల్ల వచ్చే అవకాశం**
- **ప్యూరిన్లు అధికంగా ఉండే ఆహారం, మద్యం, చక్కెర పానీయాలు కూడా కారణమే**

మన శరీరంలో కొన్ని రకాల వ్యర్థ పదార్థాలు పేరుకుపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అటువంటి వాటిలో యూరిక్ యాసిడ్ రాళ్లు కూడా ఒకటి. ఇవి మూత్రపిండాల్లో ఏర్పడే ఒక రకమైన కిడ్నీ స్టోన్స్. మూత్రంలో యూరిక్ యాసిడ్ పరిమాణం అధికమైనప్పుడు, అది స్ఫటికాలుగా మారి మూత్రపిండాల్లో పేరుకుపోతుంది. ఈ స్ఫటికాలు గట్టిపడి రాళ్లుగా రూపాంతరం చెందుతాయి. ఈ రాళ్లు మూత్రనాళం ద్వారా కిందకు ప్రయాణిస్తాయి. కొన్నిసార్లు ఇవి కదలకుండా ఉండిపోయి తీవ్రమైన నొప్పిని, మూత్రనాళంలో అడ్డంకులు, ఇన్ఫెక్షన్లు మరియు ఇతర ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి.

## యూరిక్ యాసిడ్ అంటే ఏమిటి?

యూరిక్ యాసిడ్ అనేది ప్యూరిన్ల జీవక్రియలో భాగంగా ఏర్పడే ఒక వ్యర్థ పదార్థం. ప్యూరిన్లు అనేవి కొన్ని రకాల ఆహార పదార్థాలలో ఉంటాయి మరియు మన శరీరం కూడా సహజంగా వీటిని ఉత్పత్తి చేస్తుంది. సాధారణంగా, యూరిక్ యాసిడ్ మూత్రంలో కరిగిపోయి బయటకు విసర్జించబడుతుంది. అయితే, మూత్రం మరీ ఆమ్లయుతంగా మారినా లేదా చిక్కగా తయారైనా, యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి రాళ్లు ఏర్పడటానికి దారితీస్తుంది. ఈ రాళ్లు చాలా చిన్న పరిమాణం నుండి పెద్దగా అడ్డంకులు కలిగించేంత పరిమాణం వరకు ఉండవచ్చు. కాల్షియం ఆధారిత రాళ్లతో పోలిస్తే, యూరిక్ యాసిడ్ రాళ్లను తరచుగా జీవనశైలి మార్పుల ద్వారా చికిత్స చేయవచ్చు. అందుకే వీటిని ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యం.

## యూరిక్ యాసిడ్ రాళ్ల లక్షణాలు

చిన్న రాళ్లు ఎటువంటి లక్షణాలు చూపించకుండానే మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోవచ్చు. కానీ, పెద్ద రాళ్లు ఏర్పడినప్పుడు నొప్పి, మూత్రం సరిగా రాకపోవడం, ఇన్ఫెక్షన్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. సాధారణంగా కనిపించే కొన్ని లక్షణాలు కింద ఇవ్వబడ్డాయి:

- నడుముకు ఇరువైపులా లేదా కింది భాగంలో తీవ్రమైన నొప్పి.
- నడుము భాగంలో లేదా కడుపులో నొప్పి తగ్గకుండా ఉండటం.
- మూత్రంలో రక్తం కనిపించడం.
- వికారం లేదా వాంతులు.
- జ్వరం మరియు చలి.
- మూత్రం దుర్వాసన రావడం లేదా నురగతో కూడి ఉండటం.
- యూరిక్ యాసిడ్ రాళ్లు ఎలా ఏర్పడతాయి?

## యూరిక్ యాసిడ్ రాళ్లు ఏర్పడటానికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి:

ఆహారంలో యూరిక్ యాసిడ్ లేదా ప్రోటీన్‌ను ప్రాసెస్ చేయడంలో సమస్యలు శరీరం యూరిక్ యాసిడ్ లేదా ప్రోటీన్‌ను సరిగ్గా ప్రాసెస్ చేయలేనప్పుడు, మూత్రంలో యాసిడ్ పేరుకుపోతుంది. ఇది తరచుగా తల్లిదండ్రుల నుంచి జన్యుపరంగా సంక్రమిస్తుంది. గౌట్ వంటి పరిస్థితులలో ఇది కనిపిస్తుంది. గౌట్ ఉన్నవారిలో రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయులు ఎక్కువగా ఉండి, కీళ్లలో బాధాకరమైన స్ఫటికాలు పేరుకుపోతాయి. డయాబెటిస్ ఉన్నవారికి కూడా యూరిక్



యాసిడ్ రాళ్లు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

## ప్యూరిన్లు అధికంగా ఉండే ఆహారం

ప్యూరిన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం యూరిక్ యాసిడ్ రాళ్లకు ఒక ప్రధాన కారణం. ఇది యూరిక్ యాసిడ్ ఉత్పత్తిని పెంచుతుంది. గొడ్డు మాంసం, పౌల్ట్రీ, పంది మాంసం, చేపలు (హెర్రింగ్, ట్రౌట్, సార్డినెస్ వంటివి), రెడ్ మీట్, మరియు ముఖ్యంగా కాలేయం వంటి అవయవ మాంసాలలో ప్యూరిన్లు అనే సహజ రసాయన సమ్మేళనం అధిక మొత్తంలో ఉంటుంది. ఇది రక్తం మరియు మూత్రంలో యూరిక్ యాసిడ్ స్థాయిలను పెంచి, రాళ్లు ఏర్పడటానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఆల్కహాల్, ముఖ్యంగా బీర్, మరియు ఫ్రక్టోజ్‌తో తీపి చేసిన చక్కెర పానీయాలు కూడా ప్యూరిన్ జీవక్రియను పెంచడం లేదా యూరిక్ యాసిడ్ విసర్జనను తగ్గించడం ద్వారా ఈ సమస్యకు దోహదం చేస్తాయి.

# ప్రతి నిరుపేద ఇంటికి ఇందిరమ్మ ఇళ్లు

**ఖానాపూర్ :** ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు అన్నారు. బుధవారం జన్నారంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రైతులు వివరాలను నమోదు చేసుకోవాలి



**నిర్మల్ :** ప్రభుత్వ రైతు పథకాలను వినియోగించుకునేందుకు రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలను నమోదు చేసుకోవాలని జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పోన్కల్ ఏఈఓ త్రిసంధ్య అన్నారు. బుధవారం ధర్మారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పేర్లను నమోదు చేశారు. కేంద్ర, ప్రభుత్వ పథకాల లబ్ధిని ఫార్మర్ రిజిస్ట్రేట్ ద్వారా రైతులు పొందవచ్చని సూచించారు.

# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 17 మంది గైర్హాజరు

**మంచిర్యాల :** మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలకు 17 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జనరల్ విద్యార్థులకు పది మందికి అందరూ హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 26 మందికి గాను 14 మంది హాజరుకాగా 12 మంది రాలేదు. మధ్యాహ్నం నిర్వహించిన ఒకేషనల్ పరీక్షకు 9 మందికి ఐదుగురు గైర్హాజలైనట్లు డీఐఈఓ అంజయ్య తెలిపారు.

# ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

**మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా విద్యాహక్కు చట్టం, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలుకై చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారికి పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

**మానకొండూరు :** శంకరపట్నం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలం పార్టీ అధ్యక్షులు గోపగోని బసవయ్య గౌడ్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి బసవయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, కేక్ కట్ చేసి భారీ ఎత్తున బాణాసంచా పేల్చి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# టాపాసులు పేలుస్తూ సంబరాలు

**వేములవాడ :** పంజాబ్ పై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ట్రోఫీ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో వేములవాడలో బుధవారం మీడియాతో క్రీడాకారులు, క్రికెట్ అభిమానులు, విరాట్ కోహ్లీ అభిమానులు నవాజ్, అతిక్ లు మాట్లాడారు. పంజాబ్ పై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఫైనల్ మ్యాచ్లో విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. మ్యాచ్ గెలవడంతో ఫాన్స్ టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కోహ్లీ 18 సంవత్సరాల కల నెరవేరిందని ఫ్యాన్స్ తమ అభిప్రాయాలను తెలిపారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం

**పెద్దపల్లి :** అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు అన్నారు. బుధవారం ఓదెల మండలం గుండ్లపల్లిలో రూ. 8లక్షల నిధులతో సీసీ రోడ్లకు కోసం శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలను అందజేసి నూతన ఇండ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు.

# కోరుట్లలో శ్రీ దుర్గా దేవాలయం తృతీయ వార్షికోత్సవం

**కోరుట్ల :** కోరుట్ల పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ వద్ద గల శ్రీ దుర్గా దేవాలయం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని బుధవారం దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్. వారితోపాటు బీజేపీ నాయకులు, బీజేవైఎం, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

# ఎస్సైను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

**ఖమ్మం :** తల్లాడ మండలం స్థానిక పోలీస్ స్టేషన్ లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెంకటకృష్ణను తల్లాడ మండలం కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దగ్గుల రఘుపతి రెడ్డి, ఎర్రి కృష్ణారావు, కటికి కిరణ్ కుమార్, షేక్ జమాల్, రవి కిషోర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మంత్రి తుమ్మల

**సత్తుపల్లి :** సత్తుపల్లి మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి పున ప్రతిష్ట, బొడ్రాయి పూజా కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు మంత్రి తుమ్మలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ శ్రేణులు ఉన్నారు.

# ఇందిరా డయిరీని విజయవంతం చేయండి

**మధిర :** మధిర శాసన సభ్యులు, రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం మధిర లోని వారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఇందిరా డెయిరీ నియోజకవర్గంలో గొప్ప ఆశయంతో చేపట్టిన కార్యక్రమం అధికారులు మనస్ఫూర్తిగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

# రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**కొత్తగూడెం:** భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు అందజేసిన వెంటనే భూ సమస్యలు పరిష్కారం చేస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. జూన్ 20 వరకు నిర్వహించు రెవిన్యూ సదస్సులలో భాగంగా బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం బంగారు చిలక గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతిలో భూ సమస్యలపై రైతులు ఇచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు.

# తుడా టవర్స్ త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వస్తాం..

**– తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి..**

తిరుపతి నడిబొడ్డున నిర్మితమవుతున్న తుడా టవర్స్ ను త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలియజేశారు.. బుధవారం తుడా అధికారులతో కలిసి ఆయన తుడా టవర్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను తప్పక పాటించాలని సూచించారు. అదేవిధంగా నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం జరగాలన్నారు. తుడా టవర్స్ రైల్వే స్టేషన్ బస్టాండుకు సమీపంలో ఉండడం డిమాండ్ అధికంగా ఉందని పేర్కొన్నారు. ఎక్కడ రాజీ పడకుండా నిర్ణీత గడువులోపు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర, డిఈ భాష, ఏ ఈ షణ్ముగం, కేపిసి కాంట్రాక్టర్ సుశీల్ ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.

# అమాస రాజశేఖర్ రెడ్డికి అభినందనలు...

చిత్తూరు జిల్లా సహకార కోపరేటివ్ బ్యాంక్ (ఆఅఅః) చైర్మన్ గా బుధవారం చిత్తూరు లోని జిల్లా కేంద్ర కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అమాస రాజశేఖర్ రెడ్డి ని పలువురు అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాజశేఖర్ రెడ్డి జిల్లా రైతాంగానికి సంబంధించిన ఫైలుపై మొదటి సంతకం చేసారు.. జిల్లా రైతాంగానికి అన్నివేళలా అందుబాటులో ఉంటానని చంద్రబాబు నాయుడు, లోకేష్, తనకు అప్పజెప్పిన పదవిని ఓ బాధ్యతగా స్వీకరించి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులను కలుపుకొని వారి సూచనలను సలహాలను పరిగణలోకి తీసుకొని జిల్లా రైతాంగానికి మేలు కలిగేలా పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానన్నారు. చిత్తూరు ఉమ్మడి జిల్లా డిసిసిబి అధ్యక్షునిగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగిరి ఎమ్మెల్యే భాను ప్రకాష్, చిత్తూరు తిరుపతి మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, సుగుణమ్మ,బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి, చినబాబు,పార్లమెంటు ఇంచార్జ్ సి ఆర్ రాజన్, తిరుపతి కోపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్లు భువన్ కుమార్,ఆనంద్ యాదవ్,రామమూర్తి రాయల్,బాలసుబ్రమణ్యం రెడ్డి,మునిరామయ్య లతో పాటు తిరుపతి చంద్రగిరి నగిరి చిత్తూర్ శ్రీకాళహస్తి పీలేరు నుంచి భారీ సంఖ్యలో ఎన్డీఏ కూటమి పార్టీ సీనియర్ నాయకులు, శ్రేయోభిలాషులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు

# ప్రజల దృష్టిని మళ్లించడానికే వైకాపా ధర్నాలు

**కాకినాడ** కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే జగన్ ముఠా ధర్నాల డ్రామా ఆడుతోందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ఆరోపించారు..కాకినాడలో ని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ సతీష్ మాట్లాడుతూ తొలి ఏడాదిలో 10 శాతం హామీలను కూడా అమలు చేయని జగన్ ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని దీనికి విరుద్ధంగా,కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 70% హామీలను అమలు చేసిందని, ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని స్పష్టం చేశారు..ఈమీడియా సమావేశంలో ఎమ్మెల్సీ పెరబత్తుల రాజశేఖర్,కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్,ఎమ్మెల్యే సత్య ప్రభ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, పిల్లి సత్తిబాబు, బీజేపీ నాయకులు మలకొండయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు...

# నర్సాపురంలో వెన్నుపోటు దినం

**నరసాపురం** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు అసత్య హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిందని పశ్చిమ గోదావరి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటితో సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా వైసీపీ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా నరసాపురం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ వైసీపీ పార్టీ కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది అనంతరం కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలు ఇచ్చి నెరవేర్చలేదని వారిపై తమ చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కు మెమొరాండం సమర్పించారు

అనంతరం ముదునూరి ప్రసాద్ రాజు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చాక వాటి సంగతి మరిచి ప్రజలకు వెన్నుపోటు పొడిచారు అన్నారు.రాష్ట్ర ప్రజలను అసత్య హామీలతో నమ్మించి అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవ్వడం తో ప్రజలకు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కు వ్యతిరేకంగా వైసీపీ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినం నిర్వహిస్తుంది అని అన్నారు. ప్రజలు చంద్రబాబు మాయమాటలు నమ్మి ఓట్లు వేసి గెలిపించారని అధికారం లోకి వచ్చాక వాటి సంగతే మరిచారన్నారు. చంద్రబాబుకు వెన్నుపోటు పొడవడం వెన్నతో పెట్టిన విద్యని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# సైదాపూర్ ఘటనపై పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చర్యలు

**కరీంనగర్** గత నెల 8వ తేదీన సైదాపూర్ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన నివేదిక ఆధారంగా సంబంధిత పోలీస్ సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.గత నెల 8న సైదాపూర్ పోలీస్ స్టేషన్ ప్రొబెషనరీ ఎస్సై అగస్త్య భార్గవ్ మరియు కానిస్టేబుళ్లు ఆకాష్, అజయ్ రోజువారి విధుల్లో భాగంగా సైదాపూర్ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో హుస్నాబాద్ కు చెందిన బత్తుల మహేందర్ ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, మహేందర్ పోలీసులతో వాదనకు దిగి, దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించాడని కానిస్టేబుల్ అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.అదేవిధంగా, వాహనదారుడు బత్తుల మహేందర్ ఈ ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏసీపీ హుజురాబాద్ ను పూర్తి స్థాయిలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు. ఏసీపీ హుజురాబాద్ సమర్పించిన నివేదిక ఆధారంగా, వాహన తనిఖీలు జరుగుతున్నప్పుడు వాహనదారుడు బత్తుల మహేందర్ తన వాహనాన్ని ఎందుకు ఆపారని ప్రశ్నిస్తూ, పోలీసులను దూషిస్తూ, విధులకు ఆటంకం కలిగించారని, ఈ క్రమంలో పోలీసులు మరియు వాహనదారుడికి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుందని, పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు అవసరానికి మించి బలప్రయోగం చేసారని తేలిందన్నారు.అయితే, బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు బాధితుడికి న్యాయం చేసేందుకు గాను, ఆ రోజు విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు ఆకాష్ మరియు అజయ్ లపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వారికి ఛార్జ్ మెమో జారీ చేసి పోలీస్ స్టేషన్ విధులనుండి తప్పిస్తూ హెడ్ క్వార్టర్స్కు అటాచ్ చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ఇక ట్రైనీ ఎస్సై అగస్త్య భార్గవ్పై క్రమశిక్షణా చర్యల నిమిత్తం మల్టీ జోన్ ఐజీపీ నివేదిక కూడా పంపినట్లు తెలిపారు.ఈ ఘటనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని వార్తల్లో వస్తున్న కథనం పూర్తి అవాస్తవం అని కమిషనర్ స్పష్టం చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, తప్పు చేసిన వారికీ శిక్ష తప్పదని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పునరుద్ఘాటించారు.

# మ్యూజిక్ రంగంలో అపార అవకాశాలు

మనసుకు ఉల్లాసాన్ని నింపే మ్యూజిక్ రంగంలో అవకాశాలు కూడా అపారంగా ఉంటాయని నటుడు నవదీప్ అన్నారు. పంజాగుట్టలో ఔత్సాహిక మ్యూజిక్ ట్రైనర్స్ దీపక్, విశ్వజిత్, త్రిలోక్ చందర్ లు ఏర్పాటు చేసిన బీట్ కోర్ట్ మ్యూజిక్ అకాడమిని నటుడు వంశీ చాగంటితో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన వారు కూడా మంచి సంగీతాన్ని వింటే మనసు ఉల్లాసంతో నిండిపోతుందని అన్నారు. సంగీతానికి సాంకేతికతను జోడించి విద్యార్థులకు బోధించడమే లక్ష్యంగా ఈ అక్కడ మీరు ప్రారంభించినప్పుడు చెప్పారు. స్వల్పకాలిక కోర్సులతోపాటు ఏడాది పాటు కొనసాగి డిప్లమా కోర్సును ఇక్కడ అందిస్తున్నట్లు చెప్పారు. సినీ రంగం తో పాటు ఉన్నత స్థాయిలో జరిగే మ్యూజిక్ కార్యక్రమాల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సంప్రదాయ సంగీతం తో పాటు వెస్ట్రన్ సంగీతం మెలకువలు ఇక్కడ నేర్పుతామని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు తమను సంప్రదిస్తే వారి అభిరుచిని బట్టి ఆ రంగంలో తర్ఫీదు ఇస్తామని చెప్పారు.

# ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేసిన నాయకులు

**సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం పటాన్చెరువు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దు ఆదర్శ్ రెడ్డి, బాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు వెను వెంటనే పరిష్కరించాలి

**– జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్** జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి వెనువెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం హుజురాబాద్ మండలం కనుకులగిద్దె గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం గ్రామ రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని అన్నారు. భూ సమస్యలు ఉన్న ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రెవిన్యూ అధికారులు పక్కాగా రికార్డు నమోదు చేయాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని,భూ సమస్యలున్న ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులకు హాజరై దరఖాస్తు సమర్పించాలని సూచించారు.కనుకుల గిద్దె గ్రామానికి చెందిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, అధికారులకు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. సమస్యల వారీగా అర్జీలను విభజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి రమేష్ బాబు, తహసిల్దార్ కనకయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




**సిద్దిపేట** పర్యావరణ పరిరక్షణ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.ఇలా అయితేనే మనం అందరం భావితరాలకు మంచి గాలి నీరు నేల అందించే వారమవుతామని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ ఆర్ సి పురం సహాయ పర్యావరణ శాస్త్రవేత్త టి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ది గొడ్డలి పోటు దినం:టీడీపి



**గోనెగండ్ల: జూన్ 04** బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వైసిపి తుడిచిపెట్టుకుపోయినా వైసిపి నేతలకు చలనం లేదని వైసిపి పై గొడ్డలి పోటు దినం నిరసన కార్యక్రమం టిడిపి యూత్ – టీ ఎన్ ఏస్ ఫ్ అధ్వర్యంలో చేయటం జరిగిందనీ ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసం ద్రోహం పార్టీ ఫిరాయింపులతో ప్రభుత్వాన్ని పడదోసి అధికార పీఠాన్నించుకుంటే అది కచ్చితంగా వెన్నుపోటు అవుతుందని కానీ ప్రజాభిప్రాయాన్ని వెన్నుపోటుగా పేర్కొనడం వైసిపి పార్టీకే చెల్లిందని అన్నారు.సరిగ్గా ఏడాది క్రితం 2024 జూన్ 4 వ తేదీన జగన్ పాలన అంతమైన రోజు ఐదేళ్ల నిర్బంధానికి స్థిరపడిన రోజునీ స్వేచ్ఛకు పడిన సంకెళ్లు తెగిన రోజనీ అన్నారు.కానీ వైసీపీ పార్టీ ప్రజా తీర్పుకు విరుద్ధంగా వెన్నుపోటు దినమంటూ నిరసన తెలపడం సిగ్గు తేటని అన్నారు.జగన్ తన ఐదేళ్లపాటు మద్యం మాఫియా ఇసుక మాఫియా గంజాయి ఎర్రచందనం స్మగ్లింగ్ వైసిపి జగన్ అనుంగ అనుచరులు అటవీశాఖ భూములు అలాగే నిరుపేదల భూములకు సైతం ఆక్రమణలు చేసిన గొప్ప ఘన పాటీలు వైసిపి పెద్దలు అని అన్నారు.మద్యపాన నిషేధం చేస్తానన్న జగన్ ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు.తన ఐదేళ్ల పాలనలో యువతను భారీ ఎత్తున మోసం చేసి కేవలం వాలంటరీ వ్యవస్థ పెట్టి నిరుద్యోగులను మభ్యపెట్టిన ఘనత జగన్దని అన్నారు ఎన్నికల ముందు పెద్దపెద్ద హామీలు ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అంటూ యువతను మోసం చేశారని అన్నారు.జగన్ తన ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ వేసిన పాపాన పోలేదని అన్నారు. అందుకనే నేడు వెన్నుపోటు దినం అనే బదులుగా వైసిపి గొడ్డలిపోటు దినం అంటే సరిపోతుందని అన్నారు. జగన్ తన ఐదేళ్ల చీకటి పాలనను చంద్రహాసం లాంటి మన చంద్రుడు మన చంద్రన్న వెలుగులు నింపడం జరిగిందని అన్నారు.ఈ ఐదేళ్లలో ఎక్కడ ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేసిన దాఖాలాలు లేవని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్ అండ్ బి రోడ్లు గ్రామాల్లో పట్టణాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీలు మొదలగు ప్రజా అవతరణకు భయపడే తూర్పు మాట్లాడుతూ ముందుకు సాగుతుంటే దీన్ని ఓర్వలేని జగన్ కూటమి ప్రభుత్వం పై విషం చీమ్ముతున్నారని అయినా ప్రజలు మీ కుతంత్రాలు నమ్మే పరిస్థితులు లేరన్నారు.ప్రజా తీర్పుని గౌరవించలేని వైసిపి పార్టీ రాజకీయ సమాధి కావడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యూత్ టీఎన్ఎస్ఎఫ్ సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ‘హిట్’ దర్శకుడికి తత్వం బోధపడింది



హిట్ 3 ది థర్డ్ కేస్ మొదటి వీకెండ్ ఎంత రఫ్ఫాడించినప్పటికీ తర్వాత అమాంతం డ్రాప్ అయిపోవడం దాచలేని ఓపెన్ సీక్రెట్. వంద కోట్ల పోస్టర్ వేసుకున్న మాటే కానీ నిజంగా ఆ స్థాయి ఎక్స్ ట్రాడినరి టాక్ వచ్చిందా అంటే వెంటనే ఔనని చెప్పలేని పరిస్థితి. ఇటీవలే నెట్ ఫ్లిక్స్ లోకి వచ్చాక ట్రెండింగ్ లో అయితే ఉంది కానీ నాని అభిమానులు కోరుకున్న అప్లాజ్ సోషల్ మీడియాలో కనిపించలేదు. పైగా అంతగా ఏముందని మోశారంటూ డైరెక్ట్ ఓటిటిలో చూసిన వాళ్ళు కామెంట్స్ పెట్టారు. కోర్ట్ రేంజ్ లో డిజిటల్ బ్లాక్ బస్టర్ కాకపోవచ్చనే అనుమానాలు లేకపోలేదు. దర్శకుడు శైలేష్ కొలను ఈ ఫీడ్ బ్యాక్ అంతా చూసే ఉంటారు. అందుకే ఈసారి క్రైమ్, వయొలెన్స్ కి దూరంగా ఒక కూల్ ఎంటర్ టైనర్ రాసుకున్నట్టు తెలిసింది. శ్రీకాంత్ కొడుకు రోషన్ మేకతో సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ లో దీన్ని తెరకెక్కించబోతున్నట్టు సమాచారం. ఇంకా అధికారిక ప్రకటన రాలేదు కానీ ప్రాజెక్టు లాకైపోయిందని అంటున్నారు. హిట్ సిరీస్ కి కొంత కాలం బ్రేక్ ఇద్దామని నాని ప్రతిపాదించాడట. ఎలాగూ నాలుగో భాగంలో నటించాల్సిన కార్తీ ఖైదీ ఇంకో రెండు సంవత్సరాలకు పైగానే బిజీగా ఉంది. సర్దార్ 2, ఖైదీ 2, వావా వతియర్ అంటూ మాములు బిజీగా లేడు. సో శైలేష్ పర్ఫెక్ట్ స్క్రిప్ట్ తో మెప్పిస్తేనే ఏసిపి వీరప్పన్ గా నటించేందుకు కార్తీ రెడీ అవుతాడు. చూస్తుంటే శైలేష్ కొలనుకు బాక్సాఫీస్ తత్వం బోధపడినట్టు ఉంది. ఏదైనా టాక్ లేదా రివ్యూలలో నెగటివిటి వస్తే అంత సులభంగా అంగీకరించని ఈ ఎంబిబిఎస్ డైరెక్టర్ కు హిట్ 3 యునానిమస్ గా అందరినీ మెప్పించలేదనే వాస్తవం అర్థమైపోయింది.

# దుబాయ్ ఈవెంట్‌లో సమంత.. గోల్డెన్ శారీలో మెరిసిపోయిన నటి..



టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయం, నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఇక పలు అనారోగ్య కారణాలతో ఇటీవలే సినిమాలకు కాస్త బ్రేక్ తీసుకున్న సామ్.. ఇప్పుడిప్పుడే మళ్లీ ఫామ్‌లోకి వచ్చింది. వరుస ప్రాజెక్టులతో బిజీగా మారిపోయింది. వరుస పెట్టి సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చేస్తోంది. అదే సమయంలో ఈవెంట్స్‌లో పాల్గొంటూ సందడి చేస్తోంది.తాజాగా సమంత దుబాయ్‌లో సందడి చేసింది. అక్కడ జరిగిన ఓ స్పెషల్ ఈవెంట్‌కు చాలా స్పెషల్‌గా ముస్తాబై వచ్చింది. ఎంబ్రాయిడరీ నెట్ గోల్డ్ కలర్ శారీలో మెరిసిపోయింది. సింపుల్ మేకప్, హెయి స్టైల్‌తో తన లుక్‌కు మరింత అందంగా మార్చుకని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సామ్‌ను చూసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. వారందరితో సమంత ఫొటోలు, సెల్ఫీలకు ఫోజులిచ్చింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను సామ్ తన ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట తెగ ఆకట్టుకుంటున్నాయి.ఇక సినిమాల విషయాని కొస్తే.. టాలీవుడ్‌లో సమంత సినిమా వచ్చి రెండేళ్లవుతోంది. చివరిసారిగా విజయ్ దేవరకొండతో కలిసి ‘ఖుషి’ చిత్రంతో పలకరించిన ఈ బ్యూటీ ప్రస్తుతం ‘మా ఇంటి బంగారం’ అనే మూవీ చేస్తోంది. అలాగే నెట్‌ఫ్లిక్స్‌లో ‘రక్త్ బ్రహ్మాండ్’ అనే ప్రాజెక్ట్‌లోనూ భాగమైంది.

తాను నిర్మాతగా వ్యవహరించిన తొలి చిత్రం ‘శుభం’. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ సినిమా గతనెల 9న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. హారర్ థ్రిల్లర్ జానర్‌లో వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తాజాగా ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో ఈ చిత్రం జూన్ 13 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

# పల్లెటూరి అమ్మాయి కార్యదీక్ష



రీతూవర్మ, సూర్య వశిష్ట, శివ కందుకూరి, సుబ్బరాజు ప్రధాన పాత్రధారులుగా రూపొందిన ‘దేవిక అండ్ డానీ’ వెబ్ సిరీస్ ఈ నెల 6 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో హీరోయిన్ రీతువర్మ మాట్లాడుతూ ‘వెబ్ సిరీస్‌లో నటించాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నా. కాకపోతే ఔట్ ఆఫ్ ది బాక్స్‌గా కాన్సెప్ట్ ఉండాలని కోరుకున్నా. కరెక్ట్‌గా అలాంటి కథే నా దగ్గరకు వచ్చింది. అదే ‘దేవిక అండ్ డానీ’. కథకు తగ్గట్టు సరైన టీమ్ కూడా కుదిరింది. అమ్మాయిలను ‘నువ్వు ఇది చేయలేవ్.. అది చేయలేవ్..’ అని చాలామంది డిస్కరేజ్ చేస్తుంటారు. అలాంటివారికి ఈ సిరీస్ ఓ పాఠం. అందరూ చూడదగ్గ సిరీస్ ఇది.’ అన్నారు. వినోదం, భావోద్వేగాల సమ్మేళనంగా రూపొందిన ఈ సిరీస్ ఏడు ఎపిసోడ్స్ ఉంటుందని, దర్శకుడు కిశోర్ అద్భుతంగా తెరకెక్కించాడని, ఓ పల్లెటూరి అమ్మాయి కార్యదీక్షతో ఎలా ఎదిగింది? అనే ప్రశ్నకు సమాధానమే ఈ సిరీస్ అని, రీతువర్మ అద్భుతంగా నటించిందని నిర్మాత సుధాకర్ చాగంటి చెప్పారు. స్క్రిప్ట్ పరంగానే కాక, సాంకేతికంగా కూడా సిరీస్ అద్భుతంగా ఉంటుందని దర్శకుడు బి.కిశోర్ తెలిపారు. ఇంకా మౌనిక, నందిని, డీవోపీ వెంకట్ సి.దిలీప్, సంగీత దర్శకుడు జైక్రిష్, ఎడిటర్ కార్తీక్ కూడా మాట్లాడారు.

# హృదయాలను తాకే ప్రేమకథ



హరికృష్ణ, భవ్యశ్రీ జంటగా ఓ ప్రేమకథ తెరకెక్కుతున్నది. ఆదినారాయణ పినిశెట్టి దర్శకుడు. తిరుపతి శ్రీనివాసరావు నిర్మాత. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ ‘హృదయాలను తాకే కథాంశంతో ఈ సినిమా రూపొందిస్తున్నాం. త్వరలో విడుదల తేదీని, ఆసక్తికరమైన టైటిల్‌తో ప్రకటిస్తాం.’ అని తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: విజయ్ కందుకూరి, కెమెరా: ప్రభాకర్‌రెడ్డి, సంగీతం: గౌతమ్ రవిరామ్, నిర్మాణం: టీఎస్‌ఆర్ మూవీ మేకర్స్.

# వీరమల్లు మీద కొత్త ప్రచారం



జూన్ 12 విడుదల కాబోతున్న హరిహర వీరమల్లుకు సంబంధించి పనులన్నీ జరిగిపోతున్నాయి కాబట్టి ఎలాంటి ఆటంకాలు లేవని ఫ్యాన్స్ భావిస్తున్న తరుణంలో రెండు రకాల ప్రచారాలు అయోమయంలోకి నెడుతున్నాయి. ఒకపక్క తిరుపతి ఎస్వి యూనివర్సిటి ప్రాంగణంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం అనుమతి అడిగిన లేఖ బయటికి వచ్చింది. ఇంకోవైపు నిర్మాత ఏఎం రత్నం ఫిలిం ఛాంబర్ ని కలిసి ఏపీ టికెట్ రేట్ల పెంపు కోసం లెటర్ అందించారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డిని పర్సనల్ గా కలిసి బెనిఫిట్ షోలు, రేట్ల గురించి చర్చించి వచ్చారు. సెన్సార్ రేపో ఎల్లుండో అయిపోతుందని టీమ్ చెబుతూ వస్తోంది.ఇదంతా చక్కగా జరిగిపోతున్న టైంలో హరిహర వీరమల్లు మళ్ళీ వాయిదా పడొచ్చనే టాక్ అభిమానులను కలవరానికి గురి చేస్తోంది. ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా నిప్పు లేనిదే పొగరాదు తరహాలో దీని గురించి సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు. సాంకేతిక కారణాలని ఒకరు ఆర్థిక లావాదేవీలని మరికొందరు ఇలా ఏవేవో వర్షన్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అయిదేళ్ల నిర్మాణంతో పాటు బోలెడు వాయిదాలు చవి చూసిన హరిహర వీరమల్లు మీద బజ్ ఆశించిన స్థాయిలో లేదు. సరే ట్రైలర్ వచ్చాక అన్నీ సర్దుకుంటాయనుకొనే లోపే ఇప్పుడీ పరిణామాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. అఫీషియల్ గా ఏదీ రాలేదు కాబట్టి ప్రస్తుతానికి హరిహర వీరమల్లు జూన్ 12కి కట్టుబడినట్టే. ఒకవేళ ఏదైనా అనూహ్య నిర్ణయం తీసుకుంటే జూలైకి వెళ్లాల్సి రావొచ్చు. కానీ ఆ నెల పెద్ద సినిమాలతో ప్యాకవుతోంది. నిజానికి అనుకున్న టైం సిజి వర్క్ అయిపోయి ట్రైలర్ వచ్చేసి ఉంటే ఈ డిస్కషన్లు జరిగేవి కాదు.

# గ్యాంగ్‌స్టర్‌గా రాజ్‌కుమార్ రావు.. ఇంట్రెస్టింగ్‌గా ‘మాలిక్’ టీజర్




బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘మాలిక్ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమాకు పుల్కిత్ దర్శకత్వం వహిస్తుండగా.. టిప్స్ ఫిల్మ్స్, నార్తర్న్ లైట్స్ ఫిల్మ్స్ బ్యానర్లపై కుమార్ తౌరానీ, జే షెవాక్రమణి నిర్మిస్తున్నారు. మానుషి చిల్లర్ కథానాయకగా నటిస్తుండగా.. ప్రసేన్‌జిత్ ఛటర్జీ, మేధా శంకర్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం జూలై 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. టీజర్ చూస్తుంటే.. ఈ చిత్రం 1988 అలహాబాద్ నేపథ్యంతో కూడిన అండర్‌వరల్డ్ డ్రామాగా తెరకెక్కినట్లు తెలుస్తోంది. సామాన్య యువకుడి నుంచి ఒక వ్యక్తి గ్యాంగ్‌స్టర్‌గా ఎలా మారాడు అనేది ఈ సినిమా స్టోరీ అని సమాచారం. రాజ్‌కుమార్ రావు గతంలో చేసిన కామెడీ లేదా సాఫ్ట్ పాత్రలకు భిన్నంగా, పూర్తిగా క్రూరమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో ఇందులో కనిపించబోతున్నాడు.

# ముదిరిపోతున్న ‘థగ్ లైఫ్’ కన్నడ వివాదం



ఒకపక్క కమల్ హాసన్ క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదంటూ తన సినిమా విడుదలకు ఆటంకాలు లేకుండా చూడమని కర్ణాటక హైకోర్టుని ఆశ్రయించారు. ఇంకోవైపు దీని మీద నిషేధం విధించిన కర్ణాటక ఫిలిం ఛాంబర్ పెద్దలు మరోసారి సమావేశం జరిపి నిర్ణయం తీసుకోబోతున్నారు. సాంకేతికంగా చూస్తే థగ్ లైఫ్ ని బ్యాన్ చేయడం చట్ట సమ్మతం కాదు. ఒకవేళ న్యాయస్థానం కనక పోలీసుల పహారాలో రిలీజ్ చేయమని తీర్పు ఇస్తే దాన్ని ధిక్కరించే సాహసం ఎవరూ చేయలేరు. కాకపోతే థియేటర్లలో ఉద్రిక్త సంఘటనలు జరిగే అవకాశాలను కొట్టిపారేయలేం. నిరసనకారులు ఆ దిశగానే హెచ్చరికలు జారీ చేస్తున్నారు.కోర్టు కనక కమల్ హాసన్ ని క్షమాపణ చెప్పమని కోరితే కథ సుఖాంతమవుతుంది. న్యాయ నిపుణులు చెబుతున్న దాని ప్రకారం దానికి అవకాశం లేదు. తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందని వీడియో సాక్షిగా కమల్ చెప్పారు కాబట్టి ఆ స్టేట్ మెంట్ ని సమర్థిస్తూ ఆధారాలు ఉంటే చూపమని అడగొచ్చుట. అవి చూపించని పక్షంలో సారీకి ఆదేశాలు జారీ చేసే ఛాన్స్ ఉందని అంటున్నారు. నేనేం తప్పు చేయలేదు అంటున్న కమల్ హాసన్ మరి కన్నడ తమిళం నుంచి ఎలా పుట్టిందనే దానికి వివరణ ఇవ్వడం లేదు. వివాదం అంతకంతా ముదిరిపోవడానికి ఇదే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఎల్లుండి రిలీజ్ కాబోతున్న థగ్ లైఫ్ కు ఈ కాంట్రావర్సి తీవ్ర సమస్యగా మారింది. ఒక్క థియేటర్ లో రిలీజ్ చేసినా లోపలికి వెళ్లి ధ్వంసం చేస్తామని పలు సంఘాలు హెచ్చరించడంతో ఎగ్జిబిటర్లు భయపడుతున్నారు. పోలీసులని కాపలాగా పెట్టినా ప్రేక్షకులు రావడానికి భయపడతారని, కన్నడ మద్దతుదారులు ఎలాగూ సినిమాకి రారని అలాంటప్పుడు బలవంతంగా వేయడం వల్ల నష్టం తప్ప లాభం లేదని అభిప్రాయపడుతున్నారు. ఇంకో 48 గంటల సమయం మాత్రమే ఉండటంతో ఈ పరిణామాలు శాండల్ వుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఆయనను అభిమానించే కన్నడ ఫ్యాన్స్ సైతం నిరసన గళం వినిపిస్తున్నారు.

# బంగారమ్మ జాతర



**శ్రీకాళహస్తి ( ప్రశ్న న్యూస్)** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ బంగారమ్మ జాతర ఊరేగింపు సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గపు శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బంగారమ్మకు సారెని సమర్పించి అనంతరం బంగారమ్మ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బటన్ పగిలిన రోజు

**– స్వర్ణంధ్రా అభివృద్ధి మొదలై ఏడాది**

**శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్ )** శ్రీకాళహస్తి నియోజకవర్గం లో ప్రజా పాలన మొదలై ఏడాది ఈరోజు సరిగ్గా ఏడాది క్రితం శ్రీ కాళహస్తి ప్రజలు తీర్పునిచ్చిన రోజు నన్ను ఎమ్మెల్యేగా పోటీ చేయుటకు అవకాశం కల్పించిన నారా చంద్రబాబునాయుడు కి నన్ను గెలిపించిన శ్రీకాళహస్తి ప్రజలకు మొదటగా కృతజ్ఞతలు తెలిపిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి అన్న నందమూరి తారకరామారావు విగ్రహానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే బొజ్జల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని ఏడాది పాలన సందర్భంగా కేక్ కట్ చేసి తెలుగుదేశం పార్టీ సీనియర్లకు తినిపించిన ఎమ్మెల్యే బొజ్జల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన మొదటి వ్యక్తి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని, తండ్రి శవాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసిన వ్యక్తి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని రాష్ట్రంలో ప్రజలు అవకాశం ఇస్తే ప్రజల రక్తం తాగడమే కాకుండా దౌర్జన్యాలు దాడులు ప్రజల ఆస్తులు లాక్కుని దగా చేసిన మీరు వెన్నుపోటు దినం కార్యక్రమం చేపట్టడం విడ్డురంగా ఉందని ఎద్దేవా చేసిన ఎమ్మెల్యే బొజ్జలఅటు రాష్ట్రంలో,ఇటు శ్రీకాళహస్తి నియోజకవర్గం లో ఏడాది కాలంగా ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ఎంతో లోటు బడ్జెట్ ఉన్నా కూడా నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు పరుస్తూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఘనత మన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు దని మంత్రివర్యులు నారా లోకేష్ దని తెలిపిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీ కాళహస్తి నియోజకవర్గం లో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పాలను తీసుకువచ్చి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా విద్యాపరంగా వ్యాపార పరంగా వ్యవసాయ పరంగా అభివృద్ధి పరుస్తూ ప్రజలకు సుభిక్ష పాలన అందిస్తున్నానని తెలిపిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు.

## అమ్మవారికి సారే సమర్పించిన బొజ్జల బృందమ్మ



**శ్రీకాళహస్తి ( ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ బంగారమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారికి సారే సమర్పించి, శ్రీకాళహస్తి ప్రజలందరినీ చల్లగా చూడాలని కోరుకున్న బొజ్జల బృందమ్మ ముందుగా బొజ్జల బృందమ్మ కి స్వాగతం పలికిన బంగారమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు మల్లీశ్వరి, సుమతి, గోపినాథ్,వాసు నాయుడు,ముని రాజా యాదవ్, హరి,కాద్దర్, బాలాజీ రెడ్డి, అనిత, సునీత, అనూష, సుభాషిణి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ప్రత్యేక పూజలో కోలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్(ప్రశ్న న్యూస్)** మధుర మీనాక్షి అమ్మవారి, వీరభద్ర స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు. బుధవారంనియోజకవర్గంలో 128 డివిజన్ రోడమేస్త్రి నగర్ లోని ఏర్పాటు చేసిన బోనాల మహెూత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని. అనంతరం నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ:సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు,యువజన నాయకులు పాల్గొన్నారు

## బీసీ కులగణన జాప్యం..! తీవ్ర అభ్యంతరకరం

**– కులగణన షెడ్యూల్ పై కేంద్రం స్పష్టత ఇవ్వాలి**

**– బీసీ సాధికారత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లాధ్యక్షులు : పాలాస నరేందర్**

**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ కేంద్రాన్ని తీవ్రంగా ఎత్తిపోశారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన షెడ్యూల్‌ను తక్షణమే ప్రకటించాలని, బీసీ రిజర్వేషన్ బిల్లులను చట్టబద్ధంగా ఆమోదించాలని డిమాండ్ చేశారు.



కులగణన ఆలస్యం బీసీ వర్గాల్లో నిరాశకు దారి తీస్తోందన్నారు. నేడు జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, తగిన నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఏడాది పూర్తి కొత్త ఐడియాతో దూకుడు: ఎమ్మెల్యే శ్రీ గణేష్







కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఐదో వార్డులో జ్యోతి కాలనీలో 50 లక్షల రూపాయలతో చేపట్టిన నీటి సరఫరా పైపు లైన్ పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీగణేష్, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్,బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని, నియోజకవర్గంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండాలని ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డితో, ఉన్నతాధికారులతో మాట్లాడి 5.9 ఎంజిడి ఉన్న నీటి సరఫరాను ఒక ఎంజిడి పెంచి 6.9 ఎంజిడి గా నీటి సరఫరా అవుతున్న విషయం తెలిసిందే ఆ నీటి నిల్వ చేసుకోవడానికి రిజర్వాయర్లకు కోసం నిధులు కేటాయించకుండా బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే కంటోన్మెంట్ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇటీవల వాటర్ వర్క్స్ ఎండి అశోక్ కుమార్ రెడ్డిని స్వయంగా కంటోన్మెంట్ బోర్డు కార్యాలయానికి ఆహ్వానించి బోర్డు సిఇవో వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ రాజ్ కుమార్ తో పాటు ఇతర అధికారులతో సమావేశం ఏర్పాటు చేయించి రిజర్వాయర్ల నిర్మాణానికి కూడా ప్రత్యేక నిధులు తీసుకు వచ్చి పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు. ఉన్నారు.

### బోర్డు ఎన్నికలు లేక అన్ని ఇబ్బందులే..

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగి ఇప్పటికి ఆరేళ్లు పై జరిగింది.బోర్డు పరిధిలో ఉన్న ఎనిమిది వార్డుల్లో మౌళిక సదుపాయాల విషయంలో స్థానిక నాయకులతో పాటు ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు.రక్షణ మంత్రిత్వ శాఖ సకాలంలో నిర్వహించకపోవడం వల్ల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.చివరికి ఎన్నికల అంశం స్థానిక నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు అంటే పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.నిన్న బుధవారం ఐదో వార్డు జ్యోతి కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఎమ్మెల్యే శ్రీ గణేష్ కాలనీ వాసులతో కలిసి పర్యటించారు.కాలనీవాసులు తమకు కనీస అవసరాలు చెత్త సేకరణ,నీటి సరఫరా,విద్యుత్ దీపాల ఏర్పాటు,భూగర్భ డ్రైనేజీ సక్రమంగా లేకపోవడం తదితర మౌలిక సమస్యలపై బోర్డు పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తీసుకువచ్చారు.స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పిలిపించుకుని వారి సమస్యలను వివరించి త్వరగా వీటి పరిష్కారం చేయాలనిసూచించారు.అనంతరం కాలనీ వాసులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడం వలన ఇలాంటి చిన్న చిన్న పనులను కూడా ఎమ్మెల్యే పట్టించుకోవలసి వస్తుందని, అదే బోర్డు ఎన్నికలు నిర్వహించినట్లయితే ప్రతి వార్డుకు ఒక ప్రజా ప్రతినిధి ఉంటాడని,అతను స్థాయిలో చిన్న చిన్న సమస్యలకు పరిష్కారం అవుతాయి. గతంలో ఇక్కడ వార్డు సభ్యులుగా,నామినేటెడ్ సభ్యులుగా పని చేసిన వారు పదవులపై ఉన్న శ్రద్ధను ప్రజలకు సేవ చేయడంలో చూపించలేదని,అందుకే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని,ఇప్పటికైనా ప్రజలు కూడా ఆలోచించుకుని వారికి అందుబాటులో ఉండే వారిని ఎన్నికలలో ఎన్నుకుంటే ఈ సమస్యలు ఉండవని, నేను నిత్యం అందుబాటులో ఉంటానని, అలాగే బోర్డు ఎన్నికలు నిర్వహిస్తే సమర్థులకు,నిత్యం అందుబాటులో ఉండే వారికి ఓట్లు వేసి గెలిపించుకోవాలని కాలనీ వాసులకు సూచించారు.ఎ

### ఉచిత వైద్య శిబిరం..

కంటోన్మెంట్ నియోజకవర్గం, మోండా డివిజన్ టీచర్స్ కాలనీ,అంబేద్కర్ నగర్ లో మెడికవర్ హాస్పిటల్,మాక్స్ విజన్ సహకారంతో కాంగ్రెస్ నాయకురాలు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన వచ్చింది.స్థానిక ప్రజలు వారికి ఉన్న కంటి సమస్యలతో పాటు ఇతర రుగ్మతలను వైద్యుల పర్యవేక్షణలో పరీక్షించుకున్నారు.ఉచిత శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్.ఆయనమాట్లాడుతూ సమాజంలో సేవ చేయడం భగవంతుడు ఇచ్చిన వరం,ప్రస్తుతం సమాజంలో వైద్యం అందని ద్రాక్షలా మారింది.ఇలాంటి సందర్భంలో యువరక్తం మానవత్వంతో ముందుకు వచ్చి ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు ప్రత్యక్ష సేవ చేసుకునే అదృష్టం కల్గుతుంది.నేను కూడా ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారానే ప్రజలకు దగ్గరైయ్యాను అన్న విషయాన్ని గుర్తు చేశారు.మనము నిజాయితీతో చేసే ప్రతి పని ఏదో ఒక రోజు మనకి పట్టం కడుతుందన్నారు.ప్రస్తుతం వైద్యం ఖరీదైన నేపథ్యంలో బస్తీలలోని పేదవారికి ఈ హెల్త్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయి అని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. అన్ని రకాల పరీక్షలు ఒకే దగ్గర నిర్వహించి వారికి అవసరమైన మందులు, కళ్లద్దాల లాంటివి అందించడం వలన పేదల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని శ్రీగణేష్ హెల్త్ క్యాంపు నిర్వాహకులను అభినందించారు.నాయకులు అధికారంతో సంబంధం లేకుండా ప్రజలకు సేవ చేయాలని, అప్పుడే ప్రజల కష్ట సుఖాలు తెలుస్తాయని వారికి మరింత చేరువవుతామని, మరింత మంది నాయకులు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలలో పాలు పంచుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## యాదగిరిగుట్ట ఆలయంలో సమీక్ష సమావేశం

**– యాదగిరిగుట్ట అభివృద్ధిపై ముఖ్యమంత్రి తో చర్చిస్తాం: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) 6వ తేదీన ఆలేరు నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనకు విచేస్తున్న సందర్భంగా ముఖ్యంగా యాదగిరిగుట్ట అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టి సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ లో ప్రసిద్ధ చెందిన యాదగిరిగుట్ట ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి చేయాల్సిన అభివృద్ధి పనులపై ఆలయ ఈఓ వెంకట్రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేసినదాంట్లో ముఖ్యమైన పనులకు కావాల్సిన 230 కోట్లకు రిపోర్ట్ తయారుచేసాం అన్నారు. రిపోర్టును 6వ తేదీన జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డికి అందజేస్తాం అన్నారు. యాదగిరిగుట్ట ఆలయంపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలని ఆలోచనలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. త్వరలోనే యాదగిరిగుట్ట ఆలయానికి ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటు చేస్తాం. పనులు వేగవంతం కావడానికి ఇక్కడే నిర్ణయాలు తీసుకునే విధంగా ట్రస్ట్ బోర్డ్ ద్వారా సాధ్యం అవుతుంది. ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తే విధంగా భక్తులకు సకల సౌకర్యాలు కల్పించే విధంగా ముందుకు వెళ్తాము. 6వ తేదీన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతో పాటు ఆలయ అభివృద్ధి పై కూడా మాట్లాడుతా అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి తో పాటు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చెందడానికి సీఎం రేవంత్ రెడ్డి,అధికారులు పెద్ద ఎత్తున కార్యాచరణ చేస్తున్నారు. అభివృద్ధి పనులు ఏవిధంగా చేయాలని చర్చించడానికి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాం అన్నారు. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి స్వాగతం పలకడానికి ప్రజలు పెద్ద ఎత్తున్న తరలిరావాలని పిలుపునిచ్చారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**ధర్పల్లి(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం లోని హున్నాజీపేట గ్రామంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో డా. రమ్యా రాథోడ్, శాస్త్రవేత్త (ప్రాంతీయ వరి పరిశోధన స్థానం, రుద్రూర్), వ్యవసాయ శాఖ సహకారంతో పాల్గొని రైతులకు పలు అంశాలపై శాస్త్రీయ మార్గదర్శనం అందించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, తక్కువ యూరియ వినియోగం, భాస్వరం ఎరువులు అవసరం ఉన్నంత మాత్రమే వేయాల్సిన అవసరం తదితర అంశాలు చర్చించబడ్డాయి.పురుగు మందులను అవసరమైనప్పుడు, సూచించిన మోతాదులో మాత్రమే వినియోగించాలని సూచిస్తూ,దీనివల్ల భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు ,మందులు అమ్మిన సందర్భంలో రసీదులను తీసుకొని భద్రపరచడం ఎంతో కీలకమని అధికారులు స్పష్టం చేశారు.ఏదైనా సమస్యలు వచ్చినపుడు రసీదుల ఆధారంగా విక్రేత పై కోర్టులో ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు.సాగు నీటిని ఆదా చేయడాన్ని ప్రాధాన్యతగా చూపిస్తూ,వరి పంటలో తడి పొడి విధానం ద్వారా 15–30% వరకు నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని, మొక్కజొన్నలో బిందు సేద్యం ,వరుస విడిచి వరుస నీటిపారుదల విధానాలు అమలు చేయవచ్చని వివరించారు. ఈ పద్ధతులు భూసారం కాపాడటానికి, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు దోహదపడతాయని చెప్పారు. పంట మార్పిడి పాటించడం ద్వారా నేల సారాన్ని మెరుగుపరచంతో పాటు పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. పప్పుదినుసులు, నూనె గింజల వంటి పంటలను పంట సరళిలో చేర్చితే భవిష్యత్ లో అధిక దిగుబడి సాధ్యమవుతుందని సూచించారు. చెట్ల పెంపకంపై కూడా చర్చ జరిగింది. చెట్లు వాతావరణ మార్పులను నియంత్రించడంలో, గాలిలోని కాలుష్యాన్ని తగ్గించడంలో, జీవవైవిధ్యాన్ని కాపాడడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జై. వెంకటేష్, డా.బి. అభిషేక్ వెటర్నరీ డాక్టర్ ధర్పల్లి, పి ఎ సి యాస్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, పి ఎ సి యాస్ సెక్రెటరీ గంగ నరసయ్య, రైతు సమితి కోఆర్డినేటర్ సి.హెచ్. రాము, విస్తీర్ణ అధికారి లావణ్య, స్థానిక అభ్యుదయ రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వేములవాడ రూరల్ నూతన ఎస్సైగా

# అంజయ్య బాధ్యతలు స్వీకరణ

**– శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు**

**– శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం : ఎస్సై అంజయ్య**




**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నియమితులైన ఎస్సై అంజయ్య బుధవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలో శాంతి భద్రతలు మెరుగుపరచడంలో ప్రజల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.“ కేవలం పోలీసు విభాగం మాత్రమే కాకుండా, ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యమవుతుంది. ప్రతి ఒక్కరూ నేరాల నివారణలో భాగస్వాములవ్వాలి. ఏదైనా అనుమానాస్పద కదలికలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి,” అని అంజయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొని నూతన ఎస్సైకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతల వ్యవస్థ కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుంటామని ఎస్సై అంజయ్య తెలిపారు.

## గంజి వాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు..? ప్రజల బాధలు తీరేదెన్నడు..?

**– బోయినిపల్లి మండల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**

**– అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు**

**– మండల సీపీఎం పార్టీ కన్వీనర్ : గురిజాల శ్రీధర్**



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి– వేములవాడ మార్గం, మండలంలోని స్థంభంపల్లి శివారులోని గంజి వాగుపై నిర్మించాల్సిన బ్రిడ్జి పని ఏడాది క్రితమే ప్రారంభమైంది.అయితే మధ్యలోనే నిర్మాణం నిలిచిపోయి,అక్కడి ప్రజలు రాకపోకలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.స్తంభంపల్లి,గుండన్నపల్లి,మండలంలోని పరిసర గ్రామాల ప్రజలు నిత్యం వేములవాడ పట్టణానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గంగా ఉండటంతో, బ్రిడ్జీ లేకపోవడం వల్ల వర్షాకాలంలో ఉధృతంగా నీరు ప్రవహిస్తూ బస్సులు,ఆటోలు, ద్విచక్ర వాహనాలు, అంబులెన్సులు తిరగలేని పరిస్థితి నెలకొంటోంది.బ్రిడ్జీ నిర్మాణంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అలాగే వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఈ సమస్యను పట్టించుకోకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.ఈ నేపథ్యంలో బోయినిపల్లి మండల సీపీఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ స్పందిస్తూ, “ ప్రభుత్వం, అధికారులు ఇది ప్రజల ప్రాణాలతో ఆటలాడటమే. ప్రభుత్వం వెంటనే చిత్తశుద్ధితో స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాం,” అని అన్నారు.బ్రిడ్జీ నిర్మాణ పనులు మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతాయన్న విషయంలో ఇంకా స్పష్టత లేదు. కానీ ప్రతీరోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు మాత్రం తమ ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకునే పరిస్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని బ్రిడ్జి పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీధర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు ఏ మేరకు స్పందించి ప్రజల గోడును అర్థం చేసుకొని బ్రిడ్జీ నిర్మాణానికి కృషి చేస్తారో వేచి చూడాల్సిందే..!(

## ప్రజా ప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు

# ప్రజా సమస్యలు కనబడడం లేదా




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో సమస్యలు తిష్ట వేశాయి. సమస్యలు పరిష్కరించవలసిన ప్రజా ప్రతినిధులు అధికారులు తమ సొంత అభివృద్ధికి పాటుపడుతూ ప్రజల సమస్యలను గాలికి వదిలేసారు.అలీ కేఫ్




నుండి నాగోల్ మెట్రో స్టేషన్ కు వెళ్లే దారిలో ఎక్కడ చూసినా డ్రైనేజీ మూతలు పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రజా సమస్యలు కనబడలేవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ మార్గం గుండా రోజు అనేక వాహనాలు వెళ్తాయని జరగరాని సంఘటన జరిగితే దానికి బాధ్యులు మున్సిపల్ అధికారుల లేక ప్రజాప్రతినిధులా అని ప్రజల ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంతంలో వర్షం పడితే రోడ్లపై వర్షం నీరు నిలుస్తుందని, అధికారులు వర్షం నీళ్లు ఒకేచోట నిలవకుండా ఉండే ప్రయత్నం చేయాలని రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చూడాలని, ఈ ప్రాంతంలో డ్రైనేజీ మూతలు పగిలిపోయి ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని అధికారులు కాస్త తొందరగా స్పందించి అలీ కేఫ్ నుండి నాగోల్ కు వెళ్లే దారిలో రోడ్డు పై ఎలాంటి గుంతలు లేకుండా డ్రైనేజీ మూతలను కొత్తవి ఏర్పాటు చేపట్టాలని అధికారులు కార్యాలయాల్లోనే ఒకే చోట కూర్చోకుండా ప్రజా సమస్యల పై స్పందించాలని ముఖ్యమంత్రి




రేవంత్ రెడ్డి అధికారులకు పదేపదే ప్రజా సమస్యల పై స్పందించాలని తెలిపిన అధికారులకు ప్రజా సమస్యలను తీర్చడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారు. ప్రజల సమస్యలను తీర్చడంలో అధికారులు సిబ్బంది ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్రజల సమస్యలను తీర్చడంలో ప్రజా ప్రతినిధులు అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోవడంతో ప్రజలు ఈ సమయంలో ఏ సంఘటనలతో







ప్రమాదాలన బారిన పడతారో అని భయంతో వనకి పోతున్నారు.

# ఈ పథకాలకు లైన్ క్లియర్.?



## – కీలక అంశాలపై చర్చకు అవకాశం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఘట్టం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నేడు మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న మంత్రివర్గ సమావేశం. రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ కీలక భేటీలో పలు ముఖ్యమైన అంశాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈ సమావేశానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్యాబినెట్ సమావేశం రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్దేశించే అనేక నిర్ణయాలకు వేదిక కానుంది. ఈ మంత్రివర్గ సమావేశంలో ప్రధానంగా ఉద్యోగుల సమస్యలపై సమగ్రంగా చర్చించనున్నారు. వారి డీఏ (కరువు భత్యం) బకాయిలు సహా ఇతర సమస్యల పరిష్కారంపై నియమించిన కమిటీ తన నివేదికను ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సమర్పించింది. ఆ నివేదికలోని ముఖ్యాంశాలను భట్టి ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి.. ఇతర మంత్రులకు వివరించారు. దీనిపై కేబినెట్ సమావేశంలో విస్తృతంగా చర్చించి, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా ఊరటనిచ్చే నిర్ణయంగా భావిస్తున్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో వాటి పూర్తిస్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని ముఖ్యమంత్రి ఇటీవల మంత్రులతో జరిగిన సమావేశంలో స్పష్టం చేశారు. దీనిపై కూడా మంత్రివర్గంతో చర్చించి ఈ పథకం అమలుకు సంబంధించిన కార్యాచరణను ప్రకటించనున్నారు. యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ఈ పథకం ప్రతిబింబిస్తుంది. అంతేకాకుండా రాష్ట్రంలో చేపట్టనున్న హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్లకు సంబంధించి కూడా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో మొత్తం 12 వేల కిలోమీటర్ల మేర హ్యామ్ మోడల్‌లో రోడ్ల అభివృద్ధి, ఉన్నతీకరణ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. మూడు దశలుగా చేపట్టే ఈ పనుల్లో భాగంగా మొదటి దశలో సుమారు 5 వేల కిలోమీటర్ల మేర హ్యామ్ రోడ్ల నిర్మాణానికి ఆర్ అండ్ బీ శాఖ ఇప్పటికే ప్రణాళికలు రూపొందించి జిల్లాల వారీగా నివేదికలను సిద్ధం చేసింది. మొదటి దశలో చేపట్టే ఈ రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రివర్గం ఆమోదం తెలపనున్నట్లు సమాచారం.

ఇది రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుంది. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించిన పురోగతిపై కూడా చర్చ జరగనుంది. అంతేకాకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్, ఎన్‌డీఎస్ఏ (నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ) నివేదికలపై కూడా కేబినెట్ చర్చించే అవకాశాలున్నాయి. వానాకాలంలో పంటల సాగు సన్నద్ధత, రైతులకు అవసరమైన సాయం, ఎరువులు, విత్తనాల లభ్యత వంటి అంశాలపై కూడా చర్చ జరగనుంది. ఇటీవల మంజూరైన రైతు భరోసా నిధుల విడుదల, రైతు రుణమాఫీ పురోగతి వంటి అంశాలు కూడా అజెండాలో ఉండవచ్చు. ఈ సమావేశం ద్వారా ప్రభుత్వం రానున్న రోజుల్లో అమలు చేయబోయే పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టత వస్తుందని ఆశిస్తున్నారు.

## గాంధీభవన్లో ప్రజల సమస్యలపై పొన్నం

### – మంత్రితో ముఖాముఖి కార్యక్రమానికి విశేష స్పందన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గాంధీభవన్లోని మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు చెప్పుకున్నారు వాటిని వెంటనే తీర్చాలని మంత్రి పొన్నం అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ మెంబర్ సురేష్ లాల్ ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అమెరికాలోకి ప్రవేశంపై

# 19 దేశాలకు షాక్..

### - ట్రంప్ కీలక ఉత్తర్వులు

- అధ్యక్షుడు ట్రంప్ నుంచి కొత్త ప్రయాణ నిషేధ ఉత్తర్వులు
- మొత్తం 19 దేశాల పౌరులపై ప్రభావం
- 12 దేశాలకు అమెరికాలో ప్రవేశం పూర్తిగా బంద్
- జాతీయ భద్రత కారణాలతోనే ఈ నిర్ణయమన్న వైట్ హౌస్
- గత న్యాయపరమైన చిక్కులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు
- కొన్ని వర్గాలకు మినహాయింపులు ప్రకటన



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీకాలాన్ని గుర్తుకు తెస్తూ మరోసారి కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ భద్రతను ప్రధాన కారణంగా చూపుతూ, 19 దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించడంపై కొత్తగా కఠినమైన ప్రయాణ ఆంక్షలు విధిస్తూ బుధవారం ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, 12 దేశాల పౌరులు అమెరికాలో ప్రవేశించడంపై పూర్తి నిషేధం అమల్లోకి రానుండగా, మరో 7 దేశాల వారికి పాక్షిక పరిమితులు వర్తిస్తాయి.పూర్తిస్థాయి ప్రయాణ ఆంక్షలు ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, బర్మా, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ ఉన్నాయి. అలాగే బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్‌మెనిస్థాన్, వెనిజులా దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించే విషయంలో పాక్షిక పరిమితులను ఎదుర్కోనున్నారు.2025 జనవరి 20న ట్రంప్ తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు 14161 ప్రకారం ఈ చర్య తీసుకున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. తీవ్రవాదం, జాతీయ భద్రతతో సహా వివిధ దేశాల వల్ల అమెరికాకు పొంచి ఉన్న ముప్పుపై సమగ్రమైన అంచనా వేసిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. సందర్శకులు, వీసా దరఖాస్తుదారుల నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం అసాధ్యంగా ఉన్న దేశాలను గుర్తించాలని, అలాంటి దేశాలు జాతీయ భద్రతకు ముప్పు కలిగించే అవకాశం ఉందని ఆ కార్యనిర్వాహక ఉత్తర్వు సంబంధిత ఏజెన్సీలను ఆదేశించింది.కాగా, 2017లో ట్రంప్ విధించిన ప్రయాణ నిషేధం, ముఖ్యంగా మెజారిటీ ముస్లిం దేశాలను లక్ష్యంగా చేసుకున్నప్పుడు అనేక న్యాయస్థానాల్లో సవాళ్లను ఎదుర్కొంది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు నెలల తరబడి జాగ్రత్తగా ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇటువంటి ఆంక్షలు విధించే అధికారం అధ్యక్షుడికి ఉందని 'ట్రంప్ వర్సెస్ హవాయి' కేసులో సుప్రీంకోర్టు గతంలోనే సమర్థించిందని వైట్ హౌస్ విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్ గుర్తుచేసింది.అయితే, ఈ కొత్త ప్రయాణ నిషేధం నుంచి చట్టబద్ధమైన శాశ్వత నివాసితులు (గ్రీన్ కార్డ్ హోల్డర్లు), ఇప్పటికే వీసాలు కలిగి ఉన్నవారు, కొన్ని ప్రత్యేక వీసా కేటగిరీల వారికి, అమెరికా జాతీయ ప్రయోజనాలకు అవసరమైన వ్యక్తుల ప్రవేశానికి మినహాయింపులు కల్పించారు.ఈ చర్యను అధ్యక్షుడు ట్రంప్ "విదేశీ తీవ్రవాదులు, ఇతర జాతీయ భద్రత, ప్రజా భద్రతకు ముప్పు కలిగించే వారి నుంచి అమెరికాను రక్షించడానికి ఉద్దేశించిన 'సాధారణ భద్రతా ప్రమాణాలు'" అని అభివర్ణించారు.

## సైనికాధికారులకు విశిష్ట సేవల పతకాలు

# ప్రదానం చేసిన రాష్ట్రపతి



సైనికాధికారులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశిష్ట సేవా పతకాలు ప్రదానం చేశారు. త్రివిధ దళాలకు ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలను ప్రదానం చేశారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రపతి భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 30 మంది అధికారులకు పరమ విశిష్ట సేవా పతకాలు, ఐదుగురికి ఉత్తమ యుద్ధ సేవా పతకాలు, 57 మందికి అతి విశిష్ట సేవా పతకాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. పరమ విశిష్ట సేవా పతకం, నౌ సేనా మెడల్ పొందిన వారిలో ఆంధ్రప్రదేశ్ లోని తెనాలికి చెందిన వైస్ అడ్మిరల్ శ్రీనివాస్ వెన్నం ఉన్నారు. కొచ్చి కేంద్రంగా ఉన్న సదరన్ కమాండ్ లో నౌకాదళానికి చెందిన అన్ని రకాల శిక్షణ పర్యవేక్షణలో ఆయన ఉన్నారు. 38 ఏళ్లుగా వివిధ హోదాల్లో నౌకాదళంలో సేవలందిస్తూ వైస్ అడ్మిరల్ స్థాయికి చేరుకున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588